ఈనాడు
అమరావతి
గుంటూరు
సోమవారం అక్టోబరు 14, 2024



అఖిలాండేశ్వరి.. ఆనందరూపిణి..

ఈనాడు, డిజిటల్ – అమరావతి

విజయవాడ దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో శరన్నవ రాత్రి మహోత్సవాలు ఘనంగా ముగిశాయి. శనివారం దుర్గమ్మ శ్రీరాజరాజేశ్వరీదేవి రూపంలో భక్తులకు దర్శనమిచ్చింది. తెల్లవారుజామున 2.30 గంటల నుంచి రాత్రి 12 గంటల వరకు దర్శనాలు కొనసాగాయి. విజయదశమి కావడంతో మూలానక్షత్రం స్థాయిలో భక్తులు పోటెత్తారు. 10 రోజుల్లో 9 లక్షల మంది భక్తులు వచ్చారు. శనివారం సాయంత్రం కృష్ణా నదిలో గంగా పార్వతీ సమేత దుర్గా మల్లేశ్వరుల తెప్పోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు.



తరలివచ్చిన భవానీలు

శరణు శరణు.. దుర్గాభవానీ

ఈవో రామారావు, వేద పండితులు కలిసి మంగళవాయిద్యాలు, కోలాటం మధ్య ఉత్సవమూర్తులను ఊరేగింపుగా దుర్గాఘాట్‌కు తెచ్చారు. ఉత్సవ మూర్తులకు హారతులు ఇచ్చి, పూజలు చేసి.. విద్యుత్తు కాంతులతో అలంకరించిన హంస వాహనంపై ఉంచారు. దుర్గగుడి అర్చకులు, వేదపండితులు ప్రత్యేక పూజలు చేశారు. కలెక్టర్ సృజన, పోలీసు కమిషనర్ రాజశేఖర్ బాబు, మున్సిపల్ కమిషనర్ ధ్యాన చంద్ర పాల్గొన్నారు. ఆ పై ఉత్సవ మూర్తులను వన్‌టౌన్ రాజాకు తెచ్చి.. పూజలు చేశారు. భక్తుల భారీగా తరలి వచ్చి.. తెప్పోత్సవం తిలకించారు. బ్యారేజీ పరిసరాలు భక్తులతో కిటకిటలాడాయి.



ఆర్ అగ్రహారంలో పూలపల్లకీ ఉత్సవంలో అమ్మవారు



పెద్దఎత్తున పాల్గొన్న నగరవాసులు

శ్రీభువనేశ్వరి.. సిరివరదాయని..


గుంటూరు నగరంలో దసరా మహోత్సవాలు కనుల పండువగా జరిగాయి. గంటలమ్మచెట్టువీధిలోని శ్రీవాసవి కన్యకాపరమేశ్వరీ అమ్మవారి దేవస్థానంలో ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహాన్ని పూలపల్లకీలో ఊరేగించారు.కేరళ నృత్యాలు, చిన్నారుల కోలాటాలు ఆకట్టుకున్నాయి. ఊరేగింపులో బాలరాముడి విగ్రహం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఉత్సవాలను తిలకించేందుకు భారీ సంఖ్యలో నగరవాసులు పాల్గొన్నారు.

- ఈనాడు, అమరావతి



ఉత్సవంలో కొలువైన బాలరాముడు





విజేతకు చెక్కు అందజేస్తున్న పెమ్మసాని, చిత్రంలో ఎమ్మెల్యేలు నసీర్, ప్రవీణ్

'ఇండియా పోస్ట్ రన్'లో కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని

వ్యాయామానికి సమయమిస్తేనే ఆరోగ్యం

గుంటూరు(పట్టాభిపురం), న్యూస్‌టుడే: 'హెల్త్ ఇండియా.. హ్యాపీ ఇండియా' నినాదం ప్రతి ఒక్కరూ పాటించాలని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. పోస్టల్ శాఖ ఆధ్వర్యంలో 'ఇండియా పోస్ట్ రన్-2024' కార్యక్రమాన్ని గుంటూరులో ఆదివారం నిర్వహించారు. మహిళలు, పురుషులకు 10కె, 5కె, 3కె రన్ నిర్వహించారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన వారికి పెమ్మసాని నగదు బహుమతులు ఇచ్చారు. ఈ సందర్భంగా ప్రత్యేక పోస్టల్ కవర్‌ను ఆవిష్కరించారు. పెమ్మసాని మాట్లాడుతూ 'చిన్నతనం నుంచే పిల్లలకు వ్యాయామం, నడక, ఆటలు తప్పనిసరి చేయాలి. సామర్థ్యం కేవలం శరీరానికి సంబంధించింది కాదు. మనసు, మెదడుకు సంబంధించింది. సామర్థ్యం ఉన్నవారు చురుగ్గా ఆలోచిస్తారు. సమస్యలను వేగంగా పరిష్కరిస్తారు. టీవీలు, సెల్‌ఫోన్లకు రోజులో నాలుగైదు గంటల సమయాన్ని వృథా చేస్తున్నారు. అందరిలోనూ మార్పు రావాలి. వృత్తి, వ్యాపార పరంగా ఎంత తీరిక లేకున్నా వ్యాయామానికి సమయం కేటాయిస్తేనే ఆరోగ్యంగా ఉంటాం'.. అని పేర్కొన్నారు. తొలుత పరుగు పోటీలను జేసీ భార్గవ్‌తేజ ప్రారంభించారు. కార్యక్రమంలో గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్ , పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ నగరపాలక సంస్థ కమిషనర్ శ్రీనివాసులు, జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు, తెదేపా నాయకులు మద్దిరాల మ్యాని, సాయికృష్ణ, పోస్టల్‌శాఖ అధికారులు పాల్గొన్నారు.

విశాఖ స్టీల్ ప్లాంట్‌ను కాపాడేందుకు చంద్రబాబు కృషి

గుంటూరు(పట్టాభిపురం): విశాఖ స్టీల్ ప్లాంట‌్‌ను కాపాడేందుకు సీఎం చంద్రబాబు తీవ్రంగా కృషి చేస్తున్నారని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. గుంటూరులో ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. 'చంద్రబాబు ఇటీవల దిల్లీ వచ్చినప్పుడు ఉదయం నుంచి రాత్రి వరకు అక్కడే ఉండి విశాఖ స్టీల్ ప్లాంట్‌ను కాపాడడంతో పాటు కార్మికులకు న్యాయం చేయాలని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో చర్చలు జరిపారు. ఇలాంటి నాయకులు ఎంత మంది ఉంటారు. వైకాపా నేతలు మాత్రం రోజూ అర్థం పర్థం లేని ఆరోపణలు చేస్తున్నారు'.. అని ధ్వజమెత్తారు. 'రాజధాని అమరావతికి రూ.250 కోట్లతో టెక్నాలజీ సెంటర్ తీసుకొచ్చాం. ప్రత్తిపాడుకి 100 పడకల ఈఎస్ఐ ఆసుపత్రిని తీసుకొచ్చాం. అమరావతిలో రెండు మూడు వందల బెడ్లతో ఈఎస్ఐ ఆసుపత్రికి కేంద్రం ప్రణాళిక చేస్తోంది. అమరావతి మహానగరం కాబోతోందని, పెద్ద ఆసుపత్రి ఇవ్వాలని కేంద్ర కార్మిక శాఖ మంత్రిని కోరగా.. ఆయన సానుకూలంగా స్పందించారు'.. అని పెమ్మసాని వివరించారు.

ఈనాడు, అమరావతి

లక్కు.. కిక్కు!

ప్రైవేటు మద్యం దుకాణాల నిర్వహణకు లాటరీ నేడు

ఉదయ 8 నుంచి ఎంపిక ప్రక్రియ ప్రారంభం

ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రైవేటు మద్యం దుకాణాల నిర్వహణకు సోమవారం లాటరీ ప్రక్రియ ద్వారా లైసెన్సుదారుల ఎంపికకు గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో ఎక్సైజు అండ్ ప్రొహిబిషన్ యంత్రాంగం కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నూతన మద్యం పాలసీని తీసుకొచ్చింది. దాన్ని అనుసరించి ప్రైవేటు మద్యం దుకాణాలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించి ఆ మేరకు ఈ నెల ఒకటో తేదీ నుంచి 11 వరకు దరఖాస్తులు స్వీకరించింది. గుంటూరు జిల్లాలో 127 షాపులకు 4448 దరఖాస్తులు వచ్చాయి.

రాజధాని ప్రాంతంలో పోటీ..

రాజధాని జిల్లా కావడంతో వ్యాపారం బాగుంటుందని భావించి పెద్దఎత్తున షాపుల కోసం ఇక్కడ పోటీ పడ్డారు. ప్రధానంగా తుళ్లూరు, తాడికొండ, మంగళగిరి, గుంటూరు నగరంలో ఒక్కో షాపునకు 30కు పైగా దరఖాస్తులు అందిన ఉదంతాలు ఉన్నాయి. రికార్డు స్థాయిలో రూ.88.96 కోట్ల ఆదాయం కేవలం దరఖాస్తుల విక్రయం ద్వారానే వచ్చింది. గతానికి భిన్నంగా ఈసారి ఎవరైతే వ్యాపారం చేయాలనుకుంటున్నారో వారు మాత్రమే పోటీ పడేలా దరఖాస్తు రుసుము ఫీజు రూ.2 లక్షలుగా నిర్ధారించింది.

గుంటూరు జిల్లాలో..


షాపులు	127
దరఖాస్తులు	4,448
ఆదాయం (రూ.)	88.96 కోట్లు

ఒక్కో విడతలో ఐదు దుకాణాలకు..

సోమవారం లాటరీ నిర్వహణకు గంట ముందుగానే నిర్దేశిత లాటరీ నిర్వహణ ప్రదేశానికి చేరుకోవాలని దరఖాస్తుదారులకు ఎక్సైజ్ శాఖ యంత్రాంగం సూచించింది. ఉదయం 6 నుంచి 6.30 గంటల మధ్య ఎంట్రీ పాస్‌తో లోపలికి చేరుకోవాలని ఎంట్రీ పాస్ వెంట తెచ్చుకుంటేనే అనుమతిస్తామని స్పష్టం చేశారు. ఒక్కో విడతలో ఐదు షాపులకు లాటరీ తీయడానికి దరఖాస్తుదారులను లోపలికి పంపుతారు. మిగిలిన షాపులకు దరఖాస్తు చేసుకున్న అప్పటి దాకా అధికారులు సూచించిన చోట కూర్చోవాలని వారికి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసినట్లు అధికారులు తెలిపారు.

16 నుంచి నూతన విధానం

గెజిట్ నంబర్ల వారీగా ఎంపిక చేస్తారు. ప్రతి జిల్లాలో కలెక్టర్, జేసీ వేర్వేరుగా రెండు కౌంటర్ల వద్ద ఉండి వారి సమక్షంలోనే యంత్రాంగం లాటరీ తీసేలా ఏర్పాట్లు చేసింది. ఉదాహరణకు ఒక షాపునకు లాటరీ దక్కించుకున్న వ్యక్తి నిర్దేశిత లైసెన్సు ఫీజులో ఆరో వంతు వెంటనే శాఖకు జమ చేసేలా బ్యాంకు అధికారులను లాటరీ కేంద్రానికే రప్పించనున్నారు. ఆ వ్యక్తి అదే రోజు ఆరో వంతు ఫీజు చెల్లించకపోతే ఆ తర్వాత లాటరీ దక్కిన వ్యక్తికి కేటాయిస్తారు. మొదటి వ్యక్తి నిర్దేశిత ఫీజు చెల్లించలేదని చెప్పి ఆ షాపునకు తిరిగి మరోసారి ప్రక్రియ నిర్వహించడం అనేది ఉండదు. అదే రోజు ప్రతి షాపునకు మూడు లాటరీలు తీసి ఎంపిక చేస్తారు. ఒకవేళ మొదటి వ్యక్తే వచ్చి చెల్లింపు చేస్తే ఎలాంటి అభ్యంతరం ఉండదు. అతను చెల్లించని పక్షంలోనే రెండు, మూడో లాటరీ దక్కించుకున్న వారికి అవకాశం కల్పిస్తారు. ప్రతి షాపు లాటరీ విధానంలోనే కేటాయిస్తారు. 15న ప్రైవేటు వ్యక్తులకు మద్యం దుకాణాలు అప్పగిస్తారు. 16 నుంచి కొత్త మద్యం విధానం అమల్లోకి వస్తుందని గుంటూరు జిల్లా ఉప కమిషనర్ శ్రీనివాసులు, బాపట్ల జిల్లా ఈఎస్ గంటా దేవదత్తు తెలిపారు. ఇప్పటికే లాటరీ నిర్వహణకు ఏర్పాట్లు పూర్తయ్యాయని చెప్పారు.



లాటరీ నిర్వహణ ప్రదేశాలు..

- గుంటూరు: శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరం.
- ఉదయం 6, 6.30 గంటల మధ్య లోపలికి ప్రవేశం.
- 8 గంటలకు లాటరీ ప్రక్రియ ప్రారంభం.
- లాటరీలో షాపు దక్కించుకున్నవారు అదే రోజు ఆరో వంతు ఫీజు జమ చేయాలి.

నేటి నుంచి పల్లె పండగ

114 గ్రామాల్లో 160 పనులకు భూమిపూజ

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే: గ్రామ సభలను నిర్వహించి తద్వారా గుర్తించిన పనులు చేపట్టేందుకు కూటమి ప్రభుత్వం అడుగులు ముందుకేస్తుంది. ఈ క్రమంలోనే ఉపాధి హామీ పథకం ద్వారా మంజూరు చేసిన పనులకు నేటి నుంచి భూమి పూజా కార్యక్రమాన్ని చేపట్టనున్నారు. కార్యక్రమాన్ని పల్లెల్లో వేడుకగా నిర్వహించేందుకు కూటమి ప్రభుత్వం 'పల్లె పండగ-పంచాయతీ వారోత్సవాలు' పేరుతో సోమవారం నుంచి ఆయా పనులకు భూమి పూజ చేసి పనులను ప్రారంభించనున్నారు.

★ గత ప్రభుత్వం పంచాయతీలను పూర్తిగా నిర్వీర్యం చేసింది. సర్పంచులు సైతం కేవలం ఉత్సవ విగ్రహాలుగా మారామని.. రోడ్డుపైకి వచ్చి గగ్గోలు పెట్టినా ప్రభుత్వం రూపాయి విదల్చలేదు. కనీసం బ్లీచింగ్ వంటి వాటికి కూడా అవసరమైన సమయంలో నిధులు మంజూరు చేయని పరిస్థితులున్నాయి. కేంద్రం నుంచి వచ్చిన నిధులను వైకాపా ప్రభుత్వ హయాంలో విద్యుత్తు బిల్లుల పేరుతో దోచుకుని ఇతర కార్యక్రమాలకు మళ్లించింది. కూటమి ప్రభుత్వం వచ్చాక పల్లెల అభివృద్ధికి ప్రణాళికల ద్వారా ముందుకెళ్తుంది. పల్లెల్లో చేపట్టాల్సిన పనులపై గ్రామ సభలను నిర్వహించి గుర్తించిన ప్రభుత్వం వాటిలో ఉపాధి హామీ పథకం ద్వారా చేయగలిగినవి చేపట్టేందుకు శ్రీకారం చుట్టింది. జిల్లాలో ఉపాధి పథకం కింద రూ.13.93 కోట్లతో సీసీ రోడ్లు, సీసీ డ్రెయిన్లు ఇలా మొత్తంగా 160 పనులు చేపట్టేందుకు భూమి పూజా కార్యక్రమాలను ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ఈ మేరకు యంత్రాంగం కార్యాచరణ సిద్ధం చేసింది. ఆయా గ్రామాల్లో స్థానిక ప్రజా ప్రతినిధులను సమన్వయం చేసుకుని కార్యక్రమాలు నిర్వహించేలా చర్యలు చేపట్టింది.

ఆయువు విడిచి.. చిరంజీవిగా నిలిచి..



శ్రీనివాసరావు (పాతచిత్రం)

తాడేపల్లి, నిజాంపట్నం, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో కుటుంబ యజమాని బ్రెయిన్ డెడ్‌కు గురవడంతో వారంతా అంతులేని దుఃఖంలో మునిగిపోయారు. ఆ బాధను దిగమింగుతూ ఆ వ్యక్తి అవయవాలు దానం చేసేందుకు అంగీకరించి మానవత్వం చాటారు. ఆ నిర్ణయం మరో నలుగురి ప్రాణాలు నిలిపింది. వివరాల్లోకెళితే.. బాపట్ల జిల్లా నిజాంపట్నానికి చెందిన మత్స్యకారుడు చెన్ను శ్రీనివాసరావు(48) ఈ నెల 11వ తేదీన ద్విచక్ర వాహనంపై కృష్ణాజిల్లా మచిలీపట్నం వెళ్లి తిరిగి ఇంటికి వస్తుండగా మోపిదేవి సమీపంలో కొక్కిలిగడ్డ వద్ద ప్రమాదానికి గురయ్యారు. తీవ్ర గాయాలపాలైన అతడిని కుటుంబ సభ్యులు గుంటూరు జిల్లా తాడేపల్లి మణిపాల్ వైద్యశాల్లో చేర్చారు. వైద్యులు శ్రమించినప్పటికీ ఆయన ఆరోగ్య పరిస్థితిలో ఎలాంటి మార్పు లేకపోవడంతో వైద్య పరీక్షల అనంతరం ఆదివారం బ్రెయిన్‌డెడ్‌గా నిర్ధారించారు. శ్రీనివాసరావు అవయవాలను దానం చేసేందుకు భార్య విజయలక్ష్మి, కుమారులు సురేష్, సుబ్రహ్మణ్యం అంగీకారం తెలిపారు. దీంతో ఏపీ జీవన్‌దాన్ ఛైర్మన్ డాక్టర్ రాంబాబు, మణిపాల్ వైద్యశాల డైరెక్టర్ డాక్టర్ సుధాకర్ కంటిపూడి నేతృత్వంలో మణిపాల్ వైద్యశాలకు కాలేయం, రెండు కిడ్నీలు, కళ్లను డాక్టర్ ఎల్‌వీ ప్రసాద్ వైద్యశాలకు అందించారు. కాగా, శ్రీనివాసరావు మృతదేహానికి ఆదివారం స్వగ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు.

ఈనాడు – అమరావతి, న్యూస్‌టుడే – కొల్లిపర

విపత్తులొచ్చినా.. విత్తు చల్లాలన్నా..

డ్రోనాస్త్రం!

బుడమేరు వరదలో చిక్కుకున్న బాధితులకు ఆహారం, ఔషధాలు అందించడానికి...

వరదనీటి ప్రవాహం ఏ స్థాయిలో ఉందో గమనించడానికి.....

పొలాల్లో విత్తనాలు, పంటలకు రసాయనాలు చల్లడానికి..

పీహెచ్‌సీల నుంచి లంక గ్రామాలకు మందుల సరఫరాకు...

ఇలా ప్రతీ పనీ సులభంగా, వేగంగా పూర్తి కావడానికి డ్రోన్ల వినియోగం బాగా పెరిగింది. వీటి ప్రాధాన్యాన్ని గుర్తించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామీణ నిరుద్యోగ యువతకు శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నాయి.



సంక్లిష్ట పరిస్థితుల్లో.....

వరదలొచ్చినప్పుడు కృష్ణా నది లంక గ్రామాలకు బయట ప్రపంచంతో సంబంధాలు తెగిపోతుంటాయి. రాకపోకలుండవు. ఈ పరిస్థితుల్లో బాధితులకు అవసరమైన ఆహారం, మందులు అందించడానికి డ్రోన్లు బాగా ఉపయోగపడుతున్నాయి. పది కిలోల బరువును మోసుకెళ్తున్నాయి. అనుకున్న ప్రదేశానికి సులువుగా వెళ్లగలుగుతున్నాయి. బుడమేర వరద సమయంలో డ్రోన్లను ప్రభుత్వం బాగా వినియోగించింది. తీవ్రత ఎక్కువ ఉన్న ప్రాంతాల చిత్రాలను తీయడంతోపాటు, గండ్ల పూడ్చివేత పనుల పరిశీలనకు అవి అక్కరకొచ్చాయి.

వైద్య రంగంలోనూ..

వైద్యరంగంలోనూ డ్రోన్ల వినియోగానికి అడుగులు పడుతున్నాయి. పైలట్ ప్రాజెక్టుగా కొల్లిపర మండలంలో చేపట్టిన ప్రయోగం ఫలవంతమైంది. మున్నంగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి 15 కిలోమీటర్ల దూరంలోని అన్నవరపులంకలోని ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రానికి ఔషధాల కిట్‌ను విజయవంతంగా పంపించారు. కేవలం పది నిమిషాల వ్యవధిలోనే డ్రోన్ చేరుకుంది.

భూముల సర్వే లోనూ..

భూముల సర్వే, కొలతలకు, గట్లు, ఇతర అంశాలను గుర్తించేందుకు చిత్రాలు తీయడానికి ఇప్పటికే రెవెన్యూ, భూమి కొలతల విభాగాల్లో డ్రోన్లను బాగా వినియోగిస్తున్నారు. భూమి కొలతలు నిర్దిష్టంగా గుర్తించడంలో వీటి పాత్ర చాలా కీలకంగా ఉంది. వాగులు, వంకలు, చెరువులు, నదీ పరివాహక ప్రాంతాల్లో వీటి ద్వారా సేకరించిన చిత్రాలు భూపరిపాలనా విభాగానికి ఉపయోగపడుతున్నాయి.

సాగు లోనూ..

కూలీల కొరతను అధిగమించేందుకు, సంక్లిష్టమైన పనులు చేసేందుకు, పెట్టుబడి వ్యయాన్ని తగ్గించేందుకు డ్రోన్లు ఉపయోగపడుతున్నాయి. విత్తనాలు, పురుగుమందులు చల్లేందుకు వీటి వినియోగం బాగా పెరిగింది. తాజాగా చీడపీడల్ని గుర్తించేందుకు కూడా ప్రయోగాత్మకంగా ఉపయోగిస్తున్నారు. ఇందుకోసం సాంకేతిక విద్య అభ్యసించిన యువతతోపాటు, కొంతమంది రైతులు శిక్షణ తీసుకుంటున్నారు.



భూమి కొలతల్లో డ్రోన్ల వినియోగించిన రెవెన్యూ, సర్వేవిభాగం అధికారులు

ఔషధాల తరలింపులోనూ వినియోగం



వైద్య బృందం పర్యవేక్షణలో డ్రోన్‌లో మందుల కిట్‌ను లంక గ్రామాలకు పంపించడానికి ఏర్పాట్లు

యువతకు శిక్షణ

గుంటూరులోని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం డ్రోన్ పైలట్ల కోసం ప్రత్యేక కోర్సు నిర్వహిస్తోంది. కేంద్ర ప్రభుత్వ సహకారంతో కొల్లిపర మండలం మున్నంగి ప్రైవేటు సంస్థ యువతకు శిక్షణ ఇస్తోంది. ఈ రెండుచోట్లా 874 మందికి ధ్రువపత్రాలిచ్చారు. వీరిలో కొందరు ప్రైవేటు కంపెనీల్లో పని చేస్తుండగా, మరికొందరు సొంతంగా డ్రోన్లు కొనుగోలు చేసి స్వయం ఉపాధి పొందుతూ ఇతరులకూ అవకాశాలిస్తున్నారు. పొలాల్లో పురుగుమందులు చల్లుతూ ఎకరాకు రూ. 300 నుంచి రూ. 500 వరకు తీసుకుంటున్నారు.

★ కేంద్రం మహిళా స్వయం సహాయక బృందాలకు డ్రోన్లు ఇవ్వాలని నిర్ణయించింది. సాగు ఖర్చు తగ్గించి, పంట దిగుబడి పెంచడమే లక్ష్యంగా కిసాన్ డ్రోన్ల పేరుతో బడ్జెట్‌లో నిధులు కేటాయించింది.

★ రాష్ట్ర ప్రభుత్వం కూడా డ్రోన్ కార్పొరేషన్ ద్వారా సేవలు విస్తృతం చేసేందుకు కసరత్తు చేస్తోంది.

★ ప్రభుత్వం అనుమతిచ్చాక గ్రామీణ నిరుద్యోగ యువతకు శిక్షణ ఇస్తామని ఎన్జీరంగా వర్సిటీ డ్రోన్ పరిశోధకులు, సీనియర్ శాస్త్రవేత్త ఆచార్య ఎ.సాంబయ్య తెలిపారు.

క్రీడాకారుల్లో నైపుణ్యాభివృద్ధికి మంత్రి లోకేశ్ కృషి

ముగిసిన రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు

మంగళగిరి, న్యూస్‌టుడే: విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ సహకారంతో గుంటూరు జిల్లా మంగళగిరిలో 'ప్రైడ్ ఆఫ్ మంగళగిరి' పేరుతో నాలుగు రోజులుగా నిర్వహిస్తోన్న రాష్ట్ర స్థాయి కబడ్డీ లీగ్ పోటీలు శనివారం రాత్రి ముగిశాయి. ఫైనల్స్‌లో మహిళా విభాగంలో కృష్ణా జట్టుపై విజయనగరం జట్టు గెలిచి ప్రథమ స్థానం సాధించింది. కృష్ణాపాలెం గ్రామానికి చెందిన తెదేపా నాయకులు ఆదె రవికిరణ్ సహకారంతో రూ.లక్ష నగదు, ట్రోఫీ బహూకరించారు. పురుషుల విభాగంలో తూర్పుగోదావరి విజేతగా నిలవగా.. తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి జవ్వాది కిరణ్‌చంద్ సహకారంతో రూ.లక్ష నగదు, ట్రోఫీ అందించారు. ద్వితీయ స్థానం సాధించిన కృష్ణా జట్టుకు పద్మశాలి కార్పొరేషన్ ఛైర్మన్ నందం అబద్ధయ్య రూ.75 వేలు, తృతీయ బహుమతి గెలుపొందిన జట్టుకు గద్దె శ్రీనివాసరావు, జంపాల సుబ్బారావు రూ.50 వేలు, మహిళా విభాగంలో రెండో స్థానం సాధించిన ప్రకాశం జట్టుకు మంగళగిరి రోటరీ క్లబ్ అధ్యక్షుడు గాజుల శ్రీనివాసరావు రూ.75 వేలు, తృతీయ స్థానం సాధించిన చిత్తూరు జట్టుకు రాష్ట్ర వాణిజ్య విభాగం ప్రధాన కార్యదర్శి గూడూరు వెంకట్రావు రూ.50 వేల నగదు బహుమతిని అబద్ధయ్య అందించారు. జనసేన పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు, జనసేన నియోజక వర్గ ఇన్‌ఛార్జి చిల్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ నియోజకవర్గంలో క్రీడలతో పాటు క్రీడాకారుల్లో నైపుణ్యం పెంచేందుకు మంత్రి నారా లోకేశ్ సొంత ఖర్చులతో క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేశారన్నారు. ఏటా వివిధ రకాల క్రీడలు నిర్వహిస్తూ క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నారన్నారు. పోటీల నిర్వాహకులు తోడ్పాటు అందించిన ఆంధ్రా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి యలమంచిలి శ్రీకాంత్, మురళీకృష్ణ(మార్కొండేశ్)కు నాయకులు కృతజ్ఞతలు తెలియజేశారు.


కబడ్డీలో ప్రథమ బహుమతి గెలుపొందిన మహిళా (విజయనగరం) జట్టుకు నగదు బహుమతి అందజేస్తున్న తెదేపా నాయకులు

పొట్టకూటికి వస్తే.. ప్రాణం పోయింది

విద్యుదాఘాతంతో భర్త మృతి.. భార్యకు తీవ్రగాయాలు


చికిత్స పొందుతున్న కుమారి


ఆంజనేయులు మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై కిరణ్‌బాబు

పొన్నూరు, న్యూస్‌టుడే: విద్యుదాఘాతానికి గురై భర్త మృతి చెందగా, భార్య తీవ్రంగా గాయపడిన సంఘటన ఇది. గ్రామీణ పోలీసుల కథనం ప్రకారం.. చేబ్రోలు మండలం శ్రీరంగాపురానికి చెందిన కూలిపని ఆంజనేయులు (47) పొన్నూరు మండల కసుకర్రు గ్రామ శివారులో 20 సెంట్లు తమలపాకు తోటను కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నారు. ఆంజనేయులు, భార్య కుమారి కలిసి శ్రీరంగాపురం నుంచి కసుకర్రు పొలం వద్దకు ద్విచక్ర వాహనంపై వచ్చారు. తమలపాకు తోటలో పని ముగించుకుని అదే వారం సాయంత్రం ఇంటికి బయలుదేరారు. పంట కాలువలో చేతులు, కాళ్లు శుభ్రం చేసుకునేందుకు ఆంజనేయులు కాలువలోకి దిగారు. విద్యుత్తు తీగ పడి ఉండటాన్ని ఆయన గమనించకుండా కాలువలోకి దిగడంతో విద్యుత్తు షాకు గురయ్యారు. అది గమనించిన భార్య కుమారి భర్తను కాపాడేందుకు శత విధాలుగా ప్రయత్నించారు. అప్పటికే భర్త మృతి చెందారు. కుమారి తీవ్రంగా గాయపడ్డారు. స్థానిక రైతులు స్పందించి వెంటనే విద్యుత్తు శాఖాధికారులకు సమాచారం ఇవ్వడంతో సరఫరాను నిలిపివేశారు. ఆమెను పొన్నూరులోని ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కిరణ్ బాబు వెల్లడించారు. మృతునికి భార్య, కుమారుడు ఉన్నారు.

వరద ప్రవాహానికి కొట్టుకుపోయిన బాలుడు, ఇద్దరు వ్యక్తులు

కాపాడిన స్థానిక యువకులు

ప్రత్తిపాడు: ప్రత్తిపాడు నుంచి చినకొండ్రుపాడు, జాతీయ రహదారికి వెళ్లే నల్ల వంతెన ప్రమాదభరితంగా మారింది. సగం దెబ్బతిని కూలిపోయింది. ఇటుగా నిత్యం మూడు గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. మూడేళ్లుగా వంతెనను బాగు చేయించాలని కోరుతున్నా ఆ శాఖ అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకున్న దాఖలాలు లేవు. శనివారం కురిసిన భారీ వర్షానికి వరద నీరు ఆ వంతెన మీదుగా ఉద్ధృతంగా ప్రవహించింది. ఆ క్రమంలో గుంటూరు మండలం గొర్లవారిపాలెం గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు, ఒక బాలుడు ప్రత్తిపాడులో బంధువుల ఇంట్లో శుభకార్యానికి వెళ్తున్నారు. వరద నీటిలో నడుస్తూ వంతెన దాటే క్రమంలో సగం వంతెన దెబ్బతిన్న వైపు వెళ్లి నీటి ప్రవాహంలో పడ్డారు. కొంత దూరం వెళ్లి ముళ్ల పొదల్లో చిక్కుకున్నారు. అక్కడే ఉన్న చినకొండ్రుపాడు చెందిన ఇద్దరు యువకులు హుటాహుటిన నీటిలో దూకి ముగ్గురిని కాపాడారు. స్వల్పగాయాలతో ఆ ముగ్గురు ప్రాణాలతో బయటపడ్డారు. ఎటువంటి ప్రాణనష్టం జరగక ముందే వంతెన నిర్మాణానికి అధికారులు, ప్రజాప్రతినిధులు తగిన చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

ఉన్నట్టుండి వర్షం.. అంతలోనే ఎండ

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే: జిల్లాలో గడిచిన కొద్ది రోజులుగా వాతావరణం ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. ఉదయం ఎండ మొదలై కాసేపట్లోనే వర్షం కురుస్తోంది. అంతలోనే వర్షం వెలిసిపోయి మళ్లీ ఎండ దంచేస్తుంది. తీవ్ర ఎండ, ఉక్కపోతతో ప్రజలు సతమతం అవుతున్నారు. ఎన్నడూలేని విధంగా వర్షాకాలంలో ఈ తరహా ఎండలతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. జిల్లాలో శుక్రవారం ఉదయం నుంచి శనివారం ఉదయం వరకు సగటున 10.5 మి.మీ., శనివారం ఉదయం నుంచి ఆదివారం ఉదయం వరకు సగటున 12.2 మి.మీ వర్షపాతం నమోదైంది. గత రెండు రోజులుగా కురిసిన వర్షపాతం వివరాలు ఇలా...

మండలాల వారీగా వర్షపాతం వివరాలు (మి.మీ.) ఇలా..

మండలం	12వ తేదీ	13వ తేదీ
గుంటూరు పశ్చిమ	29.4	8.4
గుంటూరు తూర్పు	24	12
కొల్లిపర	18.2	9.4
తెనాలి	15.8	9.2
పట్టిచెరుకూరు	15.8	11.6
కాకుమాను	12.6	20.4
తాడికొండ	12.2	6.2
పెదకాకాని	11.8	8.2
దుగ్గిరాల	10.8	26.4
తుళ్లూరు	10.4	4.4
ఫిరంగిపురం	8.2	2.2
మేడికొండూరు	7.4	6.8
ప్రత్తిపాడు	4.8	26.2
మంగళగిరి	3	2.2
పెదనందిపాడు	2.6	21.6
చేబ్రోలు	2	13.2
పొన్నూరు	0.2	29.6

వీవీఐటీ విద్యార్థుల రూ.10 లక్షల విరాళం

నంబూరు (పెదకాకాని), న్యూస్‌టుడే: వరద బాధితులకు వాసిరెడ్డి వెంకటాద్రి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (వీవీఐటీ) విద్యార్థులు అండగా నిలిచారు. వారు సేకరించిన రూ.10 లక్షల నగదును చెక్కు రూపంలో విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌కు వీవీఐటీ ఛైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్, ప్రిన్సిపల్ డాక్టర్ వై. మల్లికార్జునరెడ్డితో కలిసి అందజేశారు. విద్యార్థులను మంత్రి అభినందించారు.


మంత్రి లోకేశ్‌కు చెక్కును అందజేస్తున్న వాసిరెడ్డి విద్యాసాగర్, డాక్టర్ మల్లికార్జునరెడ్డి, విద్యార్థులు


ప్రియుడి హత్య.. మనస్తాపంతో మహిళ బలవన్మరణం

పట్నంబజారు (గుంటూరు), న్యూస్‌టుడే: ప్రియుడు హత్యకు గురైన సంఘటన తట్టుకోలేక ఓ మహిళ ఆత్మహత్య చేసుకుంది. లాలాపేట పోలీసుల కథనం ప్రకారం... గుంటూరు నల్లచెరువుకు చెందిన కాకినాడ అంజలి (29)కి పెద్దపల్లి జిల్లా గోదావరిఖనికి చెందిన శివరామకృష్ణతో కొన్నేళ్ల కిందట వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలు. గోదావరిఖని యైటింక్లయిన్‌కాలనీ హనుమాననగర్‌కు చెందిన వడ్డాది వినయ్‌కుమార్‌తో ఆమెకు పరిచయం ఏర్పడింది. వీరిద్దరు వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నారు. భర్త, పిల్లల్ని వదిలివేసి అంజలి మూడు నెలలుగా ప్రియుడితో కలిసి ఉంటుంది. ఈనెల 10వ తేదీన అంజలి భర్త శివరామకృష్ణ, అన్న కుమార్ వినయ్‌కుమార్‌ను వెంబడించి ఆయుధాలతో దాడి చేసి హత్య చేశారు. ఈ కేసుకు సంబంధించి గోదావరిఖని పోలీసులు శివరామకృష్ణ, కుమార్‌లను శనివారం అరెస్టు చేశారు. అప్పటి నుంచి అంజలి గుంటూరు నల్లచెరువులోని తన కుటుంబసభ్యుల వద్దకు వెళ్లేందుకు ప్రయత్నించగా వారు నిరాకరించారు. ఒక వైపు ప్రియుడు హత్యకు గురికావటం, కుటుంబ సభ్యుల నుంచి ఆదరణ లేకపోవటంతో తీవ్ర మనస్తాపానికి గురైన అంజలి శనివారం గుంటూరు వర్కర్స్‌కాలనీలోని తన పిన్ని కనకలక్ష్మి ఇంటికి వచ్చింది. అదే వారం ఇంటిలో ఎవరూ లేని సమయంలో అంజలి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. లాలాపేట పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


అంజలి మృతదేహం

పవర్ లిఫ్టింగ్‌లో మంగళగిరి క్రీడాకారిణి ప్రతిభ

మంగళగిరి, న్యూస్‌టుడే: సౌత్ ఆఫ్రికాలోని సన్‌సిటీలో ఈ నెల 4వ తేదీ నుంచి 13 వరకు జరిగిన కామన్‌వెల్త్ పవర్ లిఫ్టింగ్ సబ్ జూనియర్, జూనియర్ పోటీల్లో గుంటూరు జిల్లా మంగళగిరికి చెందిన అంతర్జాతీయ పవర్ లిఫ్టింగ్ క్రీడాకారిణి షేక్ సాదియా అల్మాస్ నాలుగు బంగారు పతకాలు సాధించినట్లు పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విజయ భాస్కరరావు, షేక్ సంధాని ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. 57 కేజీల విభాగం, స్క్వాట్ - 185 కేజీలు, బెంచ్ ప్రెస్ 95 కేజీలు, డెడ్ లిఫ్ట్ 180 కిలోల విభాగాల్లో పసిడి పతకాలు అందుకున్నారు. సాదియా అల్మాస్‌కు మంత్రి నారా లోకేశ్, సౌత్ ఇండియా పవర్‌లిఫ్టింగ్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి సకల కోటేశ్వరరావు, ఏపీ పవర్‌లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గంటా వెంకటేశ్వరరావు, సకల సూర్యనారాయణ తదితరులు అభినందనలు తెలిపారు.


పతకాలతో సాదియా అల్మాస్

కూతురే.. కుమారుడై..

తండ్రికి తలకొరివి పెట్టిన తనయ


కలెక్టరేట్(గుంటూరు), గుంటూరు రూరల్, న్యూస్‌టుడే: అస్వస్థతకు గురై మృతి చెందిన తండ్రికి కుమార్తె అంత్యక్రియలు నిర్వహించిన సంఘటన శనివారం గుంటూరు నగర శివారులో చోటుచేసుకుంది. గోరంట్లలో నివాసం ఉంటున్న ఎం బాబ్జీనాయక్ (52) నగరంలోని ఓ ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. పిడుగురాళ్లలో విద్యుత్తు శాఖ ఏడీఈగా పనిచేస్తున్న బాబ్జీనాయక్ 20 రోజుల క్రితం నరసరావుపేటలోని ఓ ప్రైవేటు వైద్యశాలలో గుండె సంబంధిత శస్త్రచికిత్స చేయించుకుని ఇంటి దగ్గర విశ్రాంతి తీసుకుంటున్నారు. వారం రోజుల క్రితం బ్రెయిన్ స్ట్రోక్ రావటంతో గుంటూరులోని ఓ ప్రైవేటు వైద్యశాలలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందారు. ఆయనకు ముగ్గురు కుమార్తెలు. వీరిలో పెద్ద కుమార్తె జాహ్నవి ఇంజినీరింగ్ పూర్తిచేసి సివిల్స్ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్నారు. కొడుకులు లేకపోవటంతో తండ్రిపై ఉన్న మమకారంతో కర్మకాండలు నిర్వహించేందుకు పెద్ద కుమార్తె ముందుకువచ్చింది. సంప్రదాయంగా తండ్రికి ఆమె తలకొరివి పెట్టింది.


బాబ్జి నాయక్ (పాతచిత్రం)


అంత్యక్రియల్లో జాహ్నవి

గుండెపోటుతో రాజధాని రైతు మృతి

తుళ్లూరు: వైకాపా ప్రభుత్వం రాజధాని రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేసింది. ఐదేళ్ల పాలనలో ఏనాడూ వారి సమస్యలను పట్టించుకోకపోగా వార్షిక కౌలు చెల్లింపులు కూడా నిలిపివేసింది. ఆయా సమస్యలు పరిష్కరించాలని రాజధాని నిర్మాణానికి భూ సమీకరణలో భూములు ఇచ్చిన ఇనాం రైతులు కొన్ని సంవత్సరాలుగా సీఆర్డీఏ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. ఈ నేపథ్యంలో రాజధాని గ్రామం మల్కాపురం గ్రామానికి చెందిన మోతుకూరి రోశయ్య (56) కొన్నేళ్లుగా ఈ విషయంలో మానసికంగా బాధపడుతున్నారని, ఈ నేపథ్యంలో గుండెపోటుతో శనివారం సాయంత్రం మృతి చెందాడని కుటుంబ సభ్యులు తెలిపారు. రోశయ్య 96 సెంట్ల భూమిని రాజధానికి ఇచ్చారు. ఆయనకు ఒక కుమారుడు, కూతురు ఉన్నారు. ఇదే విధంగా గ్రామంలో మొత్తం 14 మంది రైతులు 33 ఎకరాల ఇనాం భూమిని ఇచ్చారు. వీరికి సీఆర్డీఏ ద్వారా ప్లాట్లు కేటాయించాల్సి ఉంది. కూటమి ప్రభుత్వమైనా ఇనాం భూముల సమస్యలను పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు.


రోశయ్య

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 135, రిటైల్ ధర - 157, చికెన్ విత్‌స్కిన్ - 228, చికెన్ స్కిన్‌లెస్ - 259.

కృష్ణా జిల్లాలో: వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -135 రిటైల్ ధర 157 చికెన్ విత్ స్కిన్ - 228, చికెన్ స్కిన్‌లెస్ - 259.

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 140, 149, 160 చికెన్ విత్ స్కిన్ - 268 చికెన్ స్కిన్‌లెస్ - 278.

నెక్ సూచించిన కోడిగుడ్లు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 525 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.98/-.

మంగళగిరి

• మంగళగిరి • తాడికొండ • ప్రత్తిపాడు



నృసింహుని పార్వేట ఉత్సవం

మంగళగిరి: మంగళగిరి శ్రీలక్ష్మీనృసింహస్వామి పార్వేట ఉత్సవాన్ని శనివారం రాత్రి అత్యంత వేడుకగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఆయుధాలు ధరించిన స్వామివారి ఉత్సవమూర్తిని అర్చకులు, భక్తులు సుమారు 10 కిలో మీటర్ల మేర ఊరేగింపుగా గిరిప్రదక్షిణ చేయించి నాలుగు కాళ్ల మండపం వద్ద కొలుదీర్చారు. తీర్థప్రసాదాల సమర్పణ అనంతరం వడ్లపూడి సెంటర్ మీదుగా స్వామి వారిని ఆలయానికి తోడ్కొని వెళ్లారు. అటవీ ప్రాంతంలోకి స్వామివారు వేటకు వెళ్లి తిరిగి రావడానికి ప్రతీకగా ఏటా ఈ ఉత్సవం నిర్వహిస్తారు. మేళతాళాల నడుమ కనులపండువగా జరిగిన ఈ ఉత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్యం

పెదనందిపాడు: ఆరోగ్యంగా ఉండేందుకు యోగా సహకరిస్తుందని రోటరీ క్లబ్ అధ్యక్షుడు ఎన్. శివప్రసాద్ అన్నారు. స్థానిక సోమేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం లోని కల్యాణ మండపంలో ఆదివారం యోగా శిక్షణ ప్రారంభం సందర్భంగా మాట్లాడారు. అనంతరం సర్దార్ వల్లభ్ భాయిపటేల్ జాతీయ పోలీస్ అకాడమీ (హైదరాబాద్) యోగా శిక్షకుడు కె.నాగమల్లేశ్వరారావు ఆసనాలను వివరించారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

మంగళగిరి: 80085 73111 ప్రత్తిపాడు: 99596 89564 తాడికొండ: 97053 99233

తాడికొండ, న్యూస్‌టుడే

? తాడికొండ గ్రామంలోని వివేకానంద పాఠశాలకు సమీపంలో విద్యుత్తు దీపాలు వెలగడం లేదు. చీకటిలో రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. – ధనేకుల తరుణ్, గ్రామస్థుడు

✔ వెలగని దీపాలకు మరమ్మతులు చేయిస్తాం.
– నాగమల్లేశ్వరరావు, విద్యుత్‌శాఖ ఏఈ, తాడికొండ

ప్రత్తిపాడు, న్యూస్‌టుడే

? వంగిపురం గ్రామ పంచాయతీ కార్యాలయం సెప్టిక్ ట్యాంకు నిండి దుర్వాసనతో వస్తోంది. ఇళ్లలో ఉండలేకున్నాం.
– నాగేశ్వరరావు, స్థానికుడు, వంగిపురం

✔ సెప్టిక్ ట్యాంకు శుభ్రం చేయించి దుర్వాసన లేకుండా చేస్తాం.
–షేక్. ఖాజా, ఇన్‌ఛార్జి ఈవోపీఆర్డీ, ప్రత్తిపాడు

తుళ్లూరు, న్యూస్‌టుడే

? అనంతవరం గ్రామంలో తాగు నీటి ట్యాంకు పైకి చింత చెట్టు కొమ్మలు పెరిగాయి. తాగునీరు కలుషితమవుతోంది.
–పారా సాంభయ్య, రైతు, అనంతవరం

✔ పారిశుద్ధ్య కార్మికులతో కొమ్మలను తొలగింపజేస్తాం.
–పి.ఆదినారాయణ, పంచాయతీ కార్యదర్శి

నష్టపరిహారం సొమ్ము పక్కదారి

అనర్హుల ఖాతాల్లో నగదు జమ ★ విచారణకు రైతుల డిమాండ్



మేడికొండూరు, న్యూస్‌టుడే

పంట నష్టపరిహారం సొమ్ము పక్కదారి పట్టిన విషయం మరొకటి వెలుగులోకి వచ్చింది. మేడికొండూరు పరిధిలో అక్రమంగా రూ.లక్షలు కాజేశారని జోరుగా ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికారులు, దళారులు కలిసి కుంభకోణానికి పాల్పడ్డారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మేడికొండూరు, యలవర్తిపాడు, సిరిపురం, వరగాని, మందపాడు, పాలడుగు కొర్రపాడు, పొట్లపాడు మొత్తం 8 గ్రామాల్లో పంట నష్టం జరిగిందని అధికారులు ప్రభుత్వానికి నివేదిక అందించారు. ఆయా గ్రామాల్లో మొత్తం 355 మంది రైతులకు గాను 220 హెక్టార్లలో పత్తి పంట పాడైపోయిందని లెక్క కట్టారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం బాధితులకు పంట నష్టపరిహారం కింద మొత్తం రూ.37.5 లక్షలు జమ చేసింది. సొమ్ము నేరుగా రైతుల వ్యక్తిగత బ్యాంకు ఖాతాలో పడ్డాయి. మేడికొండూరులో పరిశీలిస్తే 22 మంది రైతులకు గాను రూ.5.98 లక్షలు పరిహారం అందింది. జాబితాలో అసలైన రైతుల కంటే నకిలీ పేర్లు ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఈ విధంగా రూ.లక్షల్లో అక్రమానికి పాల్పడినట్లు తెలుస్తోంది.

చర్యలు తీసుకుంటాం..

మేడికొండూరు మండలం పరిధిలో సొమ్ము రూ.లక్షల్లో అవినీతి జరిగిన విషయంలో కలెక్టర్ ఆదేశాల మేరకు ఒక బృందాన్ని ఏర్పాటు చేశాం. రుజువైతే బాధ్యులపై చట్ట పరమైన చర్యలు తీసుకుంటాం. **- నున్నా వెంకటేశ్వర్లు, గుంటూరు జిల్లా వ్యవసాయ అధికారి.**

కలెక్టర్‌కు ఎమ్మెల్యే ఫిర్యాదు..

దీనికి ముందు యలవర్తిపాడు పరిధిలో రూ.4.50 లక్షలు పక్కదారి పట్టిందని విషయం బహిర్గతం కావడంతో తాడికొండ నియోజకవర్గ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ జిల్లా పరిపాలనాధికారి నాగలక్ష్మికి ఫిర్యాదు చేశారు. మేడికొండూరు మండలంలో పంట నష్టపరిహారం లబ్ధి విషయంలో ఎంత మేర అవినీతి జరిగిందో విజిలెన్స్ విచారణ జరిపి నిగ్గు తేల్చాలని ఎమ్మెల్యే సూచించారు. ప్రభుత్వం, ఉన్నతాధికారులు కలగజేసుకుని పంట నష్ట పరిహారం లబ్ధి విషయంలో విచారిస్తే ఎంతో మేర అక్రమం జరిగిందో బయటపడుతుందని స్థానిక తెదేపా నాయకులు విజ్ఞప్తి చేస్తున్నారు.

గుంతలు పూడ్చారు



పెదనందిపాడు- పర్చూరు రహదారిలో గార్లపాడు అడ్డరోడ్డు సమీపంలో ఏర్పడిన గుంతలకు ఆర్‌అండ్‌బీ అధికారులు కాంక్రీటుతో మరమ్మతులు చేయించారు. ఈ నెల 12న 'ఈనాడు'లో 'పొంచి ఉన్న ప్రమాదం' శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించి చర్యలు తీసుకున్నారు. – పెదనందిపాడు, న్యూస్‌టుడే

స్పందనకు వందనం

సొపాడు తెదేపా అధ్యక్షుడు అనారోగ్యంతో మృతి



సీతారామాంజనేయులు (పాతచిత్రం)

వట్టిచెరుకూరు, న్యూస్‌టుడే: మండలంలోని సొపాడు గ్రామానికి చెందిన తెదేపా గ్రామ అధ్యక్షుడు కన్నెగంటి సీతారామాంజనేయులు (40) అనారోగ్యంతో ఆదివారం ఉదయం మృతి చెందారు. ఆయన భార్య కన్నెగంటి అనిత గ్రామ సర్పంచిగా ఉన్నారు. పలువురు తెదేపా నాయకులు, ప్రముఖులు ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు.

నేటి నుంచి ఉరుసు మహోత్సవాలు

తాడికొండ,న్యూస్‌టుడే: తాడికొండ మండలం నిడుముక్కల గ్రామం దర్గాలో ఉరుసు మహోత్సవాలను సోమవారం నుంచి ప్రారంభమవుతున్నాయని దర్గా ముజావర్ షేక్ షబ్బీర్ బాషా తాజ్‌పుల్ ఖాద్రి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 71 ఏళ్లగా ఏటా ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. చందన సమర్పణ, మంగళవారం రాత్రి అన్నసంతర్పణ, బుధవారం దీపారధన కార్యక్రమాలు ఉంటాయని చెప్పారు.

జయహో.. దుర్గాభవాని

భక్తిశ్రద్ధలతో దసరా వేడుకలు

మంగళగిరి, ప్రత్తిపాడు, తాడికొండ నియోజకవర్గాల వ్యాప్తంగా దసరా వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఆయా ఆలయాల్లో అమ్మవార్లు విశేష అలంకరణలో దర్శనమిచ్చారు. సాయంత్రం శమీ పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రత్తిపాడులోని శ్రీఅంకమ్మతల్లి ఆలయంలో కూచిపూడి బాలికల నృత్యప్రదర్శన ఆకట్టుకుంది. పలుచోట్ల ఊరేగింపులు, అన్నదానాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. – న్యూస్‌టుడే బృందం



తాడేపల్లి : శివాలయంలో..



మంగళగిరి : కాళికామాత ఆలయంలో..




ప్రత్తిపాడు : బోయపాలెంలో..



తుళ్లూరు : అనంతవరంలో..



పెదనందిపాడు సోమేశ్వరస్వామి ఆలయంలో..



పాత మంగళగిరి దుర్గానగర్‌లో..



మంగళగిరి: మిడ్‌వ్యాలీ సిటీలో పూజలు



తుళ్లూరు: పెదపరిమిలో ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్, నాయకులు



లాలుపురంలో కోలాట ప్రదర్శన



పెదనందిపాడు: గోగులమూడిలో ఊరేగింపు



అఖిలాండేశ్వరి అమ్మవారి ఆలయంలో అన్నదానం



దుగ్గిరాల శివాలయంలో శమీపూజ



ప్రత్తిపాడు: శ్రీదండేశ్వర స్వామి ఆలయంలో..



ప్రత్తిపాడు: రజక రామాలయం వద్ద ఏర్పాటు చేసిన దుర్గామాత ఊరేగింపు

ఆంజనేయస్వామి ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన

నాగులపాడు (పెదనందిపాడు), న్యూస్‌టుడే: స్థానిక శృంగేరి శారదా పీఠ పాలిత వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణంలో పంచముఖ ఆంజనేయస్వామి ఆలయ నిర్మాణానికి శనివారం ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో శంకుస్థాపన చేశారు. కమిటీ అధ్యక్షుడు సాంబశివరావు దంతులు, ఉపాధ్యక్షుడు సుబ్బారావు దంతులు, కోశాధికారి సత్యనారాయణ దంతులు, కమిటీ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



పూజలో కమిటీ అధ్యక్షుడు సాంబశివరావు, సభ్యులు



పెదనందిపాడు పాత బస్‌స్టాండ్ సెంటర్ వద్ద..



వరగాని- కొప్పర్రు రోడ్డు

ప్రయాణం దినదిన గండం

అధ్వాన రహదారులతో ప్రజల ఇక్కట్లు

పెదనందిపాడు, న్యూస్‌టుడే: పెదనందిపాడు పాతబస్‌స్టాండ్ కూడలిలో గుంటూరు వెళ్లే రహదారి గోతులు పడి అధ్వానంగా తయారైంది. వర్షం కురిస్తే నీరు నిలిచి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ద్విచక్ర వాహన చోదకులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. వరగాని-కొప్పర్రు ఆర్‌అండ్‌బీ రహదారి సైతం దారుణంగా మారింది. ఎగుడుదిగుడుగా మారి రాకపోకలు సాగించలేని దుస్థితి నెలకొంది. గత కొన్నేళ్ల నుంచి మరమ్మతులు నిర్వహించకపోవడంతో రోడ్డు పలు చోట్ల కుంగిపోయింది. రాత్రి వేళల్లో రాకపోకలు సాగించాలంటే నరకం చూస్తున్నామని, సంబంధిత అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు. 'పెదనందిపాడు- గుంటూరు రహదారి వారం రోజులలో మరమ్మతులు చేపట్టి పూర్తి చేస్తాం. వరగాని-అన్నపర్రు వరకు మరమ్మతులు విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతాం' అని ప్రత్తిపాడు ఆర్‌అండ్‌బీ ఏఈ సంజీవ్ తెలిపారు.

నరకప్రాయం..

తాడికొండ, న్యూస్‌టుడే: తాడికొండ మండలం పొన్నెకల్లు, దామరపల్లి, గరికపాడు వెళ్లే ప్రధాన రహదారి అధ్వానంగా మారింది. భారీ గోతులతో బురదతో ప్రయాణికులు ముప్పుతిప్పలు పడుతున్నారు. గోతుల ధాటికి వాహనాలు మరమ్మతులకు గురై మరమ్మతులు రూ.వేలల్లో ఖర్చు అవుతుందని ఆటో చోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక వర్షం పడితే బురదలో ద్విచక్రవాహనాలు జారి ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా మరమ్మతులకు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.



పొన్నెకల్లు-దామరపల్లి మార్గం ఇలా..

జగనన్న కాలనీలో విద్యుత్తు తీగల చోరీ

రూ.లక్షల్లో ప్రజాధనం వృథా

మేడికొండూరు, న్యూస్‌టుడే:

మండలంలోని పేరేచర్ల శివారు బండారుపల్లి డొంకరోడ్డులో గల జగనన్న కాలనీలో రూ.లక్షలు విలువ చేసే విద్యుత్తు తీగలు చోరీకి గురయ్యాయి. ఆయా శాఖల మధ్య సమన్వయ లోపంతో ప్రజాధనం వృథాగా పోతున్నా పట్టించుకునే నాథుడే కరవయ్యారు. కాలనీలో విద్యుత్తు సౌకర్యం కల్పించేందుకు గుత్తేదారు సంస్థలు సబ్ స్టేషన్ నుంచి స్తంభాలు ఏర్పాటు చేసి వాటికి తీగలు అమర్చారు. అరకొరగా పనులు పూర్తయ్యాయి. పేదలకు మెరుగైన విద్యుత్తు సౌకర్యం కల్పించే క్రమంలో సీపీడీసీఎల్‌కు దానిని అప్పగించాల్సి ఉంది. కానీ కొన్నాళ్లుగా పనులు ఆగిపోయాయి. ఇదే చోరులకు అనువుగా మారింది. పర్యవేక్షణ లేకపోవడంతో దాదాపు 20 కిలో మీటర్ల పొడవైన విద్యుత్తు తీగలను స్తంభాలపై నుంచి కత్తిరించి దోచుకెళ్లారు. మరో టెండర్ ద్వారా ఆయా పనులు చేయించాల్సి ఉంటుంది. దీంతో అదనంగా మరింత ప్రజాధనం ఖర్చు పెట్టాల్సిందే.



పేరేచర్లలో జగనన్న లేఔట్

రూ.14 లక్షలు విలువైన సొత్తు..

జగనన్న కాలనీలో విద్యుత్తు సబ్‌స్టేషన్, స్తంభాలు, తీగలు ఏర్పాటు పనులు గుత్తేదారు సంస్థ నిర్వహిస్తోంది. ఆయా పనులు పూర్తైన తర్వాత డిపార్టుమెంట్‌కు అప్పగించాల్సి ఉంటుంది. మధ్య కాలంలో రూ.14 లక్షలు విలువైన విద్యుత్తు తీగలు చోరీకి గురయ్యాయి. దీనిపై వారం రోజుల కిందట మేడికొండూరు పోలీసులకు ఫిర్యాదు చేశాం.
- పుల్లారెడ్డి, మేడికొండూరు మండలం విద్యుత్తు శాఖ ఏఈ

ఆర్టీసీ బస్సు ఢీ.. ఒకరి దుర్మరణం

తుళ్లూరు, న్యూస్‌టుడే: రాజధాని సీడ్ యాక్సిస్ రహదారిపై వెళుతున్న ద్విచక్ర వాహనాన్ని ఆర్టీసీ బస్సు ఢీ కొట్టిన ఘటనలో ఆదివారం సాయంత్రం ఒక వ్యక్తి మృతి చెందాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని లింగాయపాలెం గ్రామానికి చెందిన ఎన్.రామారావు (45) అనే వ్యక్తి దొండపాడు టిడ్కో గృహాల్లో నివాసం ఉంటున్నారు. ఆదివారం సాయంత్రం ద్విచక్ర వాహనంపై సీడ్‌యాక్సిస్ రహదారి మీదుగా దొండపాడు వైపు వస్తున్నారు. అదే సమయంలో విజయవాడ వైపు నుంచి వస్తున్న ఆర్టీసీ బస్సు రాయపూడి జంక్షన్ వద్ద ద్విచక్రవాహనాన్ని ఢీ కొట్టింది. తీవ్ర గాయాలపాలైన రామారావు అక్కడికక్కడే మృతి చెందారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని స్థానికులు సీడ్ యాక్సిస్ రహదారిపై ధర్నాకు దిగడంతో కొద్ది సేపు ట్రాఫిక్ నిలిచిపోయింది. తుళ్లూరు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని క్రమబద్ధీకరించారు. ఈ ఘటనపై తుళ్లూరు ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేశారు.

చెరువులో పడి భవన నిర్మాణ కార్మికుడు..

తుళ్లూరు, న్యూస్‌టుడే: చెరువులో పడి భవన నిర్మాణ కార్మికుడు మృతి చెందిన ఘటన శనివారం గుంటూరు జిల్లా తుళ్లూరులో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు..శ్రీకాకుళం జిల్లాకు చెందిన సురపు రామకృష్ణ (36) కొన్నేళ్లుగా ఇక్కడే ఉంటూ గ్రామాల్లో కాంక్రిట్ స్లాబ్ పనులు చేస్తూ ఉంటారు. శనివారం మద్యం తాగి ప్రమాదవశాత్తు అయ్యన్న చెరువులో జారి పడ్డారు. స్థానికులు కాపాడేందుకు ప్రయత్నాలు చేసినా ఫలితం దక్కలేదు. నీటిలో మునిగి మృతి చెందాడు. ఈ ఘటనపై తుళ్లూరుకు చెందిన తాపీమేస్త్రి బురుసు రాంబాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సి.ఐ గంగా వెంకటేశ్వర్లు తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

గుంటూరు రూరల్, న్యూస్‌టుడే: గోరంట్ల పోలేరమ్మ గుడి సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన శనివారం వెలుగుచూసింది. నల్లపాడు పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. సుమారు 40 సంవత్సరాల వయసున్న వ్యక్తి ఆలయ సమీపంలో నిర్జీవంగా పడి ఉండడాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. నల్లపాడు పోలీసులు మృతదేహాన్ని జీజీహెచ్‌కి తరలించారు. మృతుడికి సంబంధించి ఎలాంటి వివరాలు లభించలేదని సీఐ వంశీధర్ తెలిపారు.



సీఎం సహాయ నిధికి విరాళం



పెనుమూలి (దుగ్గిరాల), న్యూస్‌టుడే: పెనుమూలి ప్రజలు ముఖ్యమంత్రి సహాయనిధికి రూ.1.92 లక్షలు సమకూర్చారు. ఈ మేరకు చెక్కును శుక్రవారం మంత్రి నారా లోకేశ్‌కు అందజేశారు. రాష్ట్రాన్ని చంద్రబాబు అయితేనే అభివృద్ధి చేయగలరనే ఉద్దేశంతో తమ గ్రామస్థులంతా ఈ మొత్తాన్ని అందించినట్లు నాయకులు చెప్పారు.

లారీ ఢీకొని వృద్ధుడు మృతి

బాపట్ల పట్టణం,: వెనుక నుంచి లారీ ఢీకొనటంతో ఓ వృద్ధుడు అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన శుక్రవారం అర్ధరాత్రి పట్టణంలో చోటు చేసుకుంది. పట్టణ పోలీసులు తెలిసిన వివరాల మేరకు పెదనందిపాడు గ్రామానికి చెందిన షేక్ మహబూబ్ జానీ (70) కర్లపాలెంలో నుంచి శుక్రవారం తన సొంతూరు వెళ్లేందుకు జాతీయ రహదారిపై కాలినడకన బాపట్ల వైపు వస్తుండగా కర్లపాలెం నుంచి బాపట్ల వైపు వస్తున్న లారీ మార్కెట్‌యార్డు సమీపంలో వెనుక నుంచి ఢీ కొట్టింది. ఈఘటనలో తలకు తీవ్రగాయాలైన అతడు అక్కడికక్కడే మృతి చెందాడు.

కృష్ణానది నుంచి ఇసుక అక్రమ తరలింపు

తాడేపల్లి, న్యూస్‌టుడే: కనకదుర్గమ్మ వారధి దిగువ భాగాన కృష్ణా కుడి కరకట్ట వెంబడి కృష్ణానదిలో ఇసుక అక్రమ రవాణాకు కొంతమంది తెరతీశారు. తాడేపల్లి మండలం గుండిమెడ ఇసుక క్వారీ నుంచి కొంతమంది అక్రమార్కులు ఇసుకను తరలించుకు పోతున్నారు. పోలీసు, రెవెన్యూ అధికారులు దశల వారీగా సిబ్బందిని కాపలా పెట్టినా వారి కళ్లు కప్పి ట్రాక్టర్ల ద్వారా తరలిస్తూ అక్రమార్జనకు పాల్పడుతున్నారు. ప్రాతూరు, చిర్రావూరు, తాడేపల్లికి చెందిన కొంత మంది ట్రాక్టర్ల యజమానులు ప్రత్యేకంగా కూలీలను ఏర్పాటు చేసుకుని రాత్రి సమయాల్లో ఇసుకను లోడు చేయిస్తున్నారు. గుట్టుచప్పుడు కాకుండా సాగుతున్న ఇసుక అక్రమ రవాణాలో స్థానికులు పాత్ర ఉందనే విషయం బహిరంగంగానే చెబుతున్నారు. తెల్లవారు జాము మూడు నుంచి నుంచి ఐదు గంటల మధ్య ఇసుకను ట్రాక్టర్ల ద్వారా తరలించుకు పోతున్నారు.పోలీసు పికెట్ ఉన్నా జనసంచారం లేకుండా చూసి పెద్ద సంఖ్యలో ట్రాక్టర్ల ద్వారా అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారు. ఇటీవల రెవెన్యూ అధికారులు రెండు ఇసుక ట్రాక్టర్లు పట్టుకుని నులకపేటలో మండల రెవెన్యూ కార్యాలయానికి తరలించారు. తాజాగా ట్రాక్టర్లలో ఇసుకను లోడు చేసుకుని తరలించేందుకు ప్రయత్నిస్తుండగా పోలీసులను చూసి వేరే మార్గంలో వెళ్లటానికి చేసిన ప్రయత్నంతో రెండు ట్రాక్టర్లు ఇసుకలో కూరుకుపోయాయి. వాహనాలను అక్కడే వదిలి డ్రైవర్లు పారిపోయారని పోలీసులకు సమాచారం అందింది. అక్రమ రవాణాపై తాడేపల్లి సీఐ కల్యాణ్‌రాజును వివరణ కోరగా క్వారీ వద్ద నలుగురు సిబ్బందితో పికెట్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

నేటి నుంచి 'పల్లె పండగ' కార్యక్రమాలు

ప్రత్తిపాడు, న్యూస్‌టుడే: ప్రత్తిపాడు మండలంలో పల్లె పండగ కార్యక్రమాన్ని సోమవారం నుంచి నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. ఉపాధి హామీ నిధులతో తిక్కిరెడ్డిపాలెం, రావిపాటివారిపాలెం, గనికపూడి గ్రామాల్లో రూ.38లక్షలతో నిర్మించనున్న సీసీ, మురుగుకాల్వల నిర్మాణానికి ఎమ్మెల్యే డాక్టరు బూర్ల రామాంజనేయులు శంకుస్థాపన చేయనున్నట్లు ఎంపీడీవో కె.శివపార్వతి చెప్పారు.

దుగ్గిరాల, న్యూస్‌టుడే: మండలంలో పల్లె పండుగ-పంచాయతీ వారోత్సవాలు నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. తొలిరోజు సోమవారం పెదకొండూరు, గొడవర్రు, వీర్లపాలెంలో శంకుస్థాపనలు జరగనున్నాయి. మండలం మొత్తం మీద 18 గ్రామాల్లో పంచాయతీరాజ్ తరపున 26 పనులకు గాను రూ.3.15 కోట్లతో పనులకు శ్రీకారం చుట్టనున్నారు.

శ్రీవారి సేవలో హైకోర్టు న్యాయమూర్తులు

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారిని ఏపీ హైకోర్టు న్యాయమూర్తులు శనివారం దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో శ్రీవారి మూలమూర్తిని ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి, జస్టిస్ రవినాథ్ తిల్హారిలు వారివారి కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం అందించగా తితిదే అధికారులు తీర్థప్రసాదాలు అందజేశారు.

పోలీస్‌స్టేషన్‌కు చేరిన గ్రావెల్ పంచాయితీ

ప్రత్తిపాడు, న్యూస్‌టుడే: నడింపాలెం రెవిన్యూ గ్రామ పరిధిలో ఓ వ్యక్తికి కొన్నేళ్ల క్రితం 3 ఎకరాల అసైన్డ్ భూమిని ప్రభుత్వం సాగు చేసుకునేందుకు ఇచ్చింది. దాన్ని ప్రత్తిపాడులోని ఓ వ్యాపారికి విక్రయించినట్లు, అదే భూమిని గ్రావెల్ తవ్వేందుకు మరొక వ్యక్తికి లీజుకు ఇచ్చినట్లు సమాచారం. ఇప్పుడు ఆ ఇద్దరూ సదరు భూమి మాదంటే మాదని గ్రావెల్ తవ్వుకునేందుకు 10 నుంచి 15 మంది వ్యక్తుల సహకారంతో గ్రూపులు కట్టారు. జేసీబీలు, టిప్పర్లు సిద్ధం చేసుకున్నారు. గత వారం రోజుల నుంచి ఈ రెండు వర్గాల మధ్య పంచాయితీ నడుస్తోంది. అధికార పార్టీల అండదండలు ఉన్నాయంటూ ఇరువర్గాల మధ్య వాగ్వాదం తీవ్రస్థాయికి చేరడంతో శనివారం సాయంత్రం ఇరు వర్గాలకు చెందిన 30 మంది ప్రత్తిపాడు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఎస్సై నాగేంద్రకు మౌఖికంగా ఫిర్యాదులు చేశారు. భూ వ్యవహారం తమకు సంబంధం లేదని ఎస్సై చెప్పడంతో ఇరువర్గాలు అక్కడి నుంచి వెళ్లిపోయారు.

రొయ్యల వేపుడులో పురుగు

తాడేపల్లి, న్యూస్‌టుడే: తాడేపల్లి బైపాస్‌రోడ్డులో ఓ హోటల్ నుంచి ఓ ఫుడ్ డోర్ డెలివరీ సంస్థ తెచ్చిన రొయ్యల వేపుడులో పురుగు ముక్కలు ఉండడం కలకలం రేపింది. తెదేపా రాష్ట్ర నాయకుడు నాదెండ్ల బ్రహ్మం చౌదరి శనివారం కూరను ఆన్‌లైన్ ద్వారా ఆర్డర్ చేశారు. ఇంటికి వచ్చిన పార్సిల్‌లో గాజుపురుగు ముక్కలు ఉండటాన్ని గమనించి అవాక్కయ్యారు. దీంతో సంబంధిత హోటల్ యజమానికి సమాచారం ఇచ్చి తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ ఛాయా చిత్రాలను సామాజిక మాధ్యమాల్లో ఉంచడంతో వైరల్ అవుతున్నాయి. హోటల్ యాజమాన్యం పొరపాటున జరిగిన ఘటనగా చెబుతోంది.

తెనాలి
• తెనాలి • పొన్నూరు

అన్న క్యాంటీన్ నిర్వహణకు విరాళం


ఎమ్మెల్యేకు చెక్కు అందజేస్తున్న మెట్ల హరిబాబు

పొన్నూరు, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం నిర్వహిస్తున్న అన్న క్యాంటీన్ నిర్వహణకు మండలంలోని మునిపల్లెకు చెందిన మెట్ల పరమేశ్వరరావు అందచేసిన లక్ష రూపాయిల చెక్కును ఆయన సోదరుడు మెట్ల హరిబాబు ఆదివారం ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్‌కు అందచేశారు.

నూతన రథం ప్రారంభోత్సవం


భక్తుల నుంచి కానుకలు స్వీకరిస్తున్న అర్చకుడు

తెనాలి (కొత్తపేట), న్యూస్‌టుడే: స్థానిక గంగానమ్మపేటలోని బాలాత్రిపురసుందరి ఆలయంలో కొలువైన అమ్మ వారికి తమిళనాడు శిల్పులతో రూ.25 లక్షలతో ప్రత్యేక నూతన రథం తయారు చేయించినట్లు ఆలయ ట్రస్టు ఛైర్మన్ పవన్ కుమార్ పేర్కొన్నారు. ఆయన ఆదివారం తెనాలిలో మాట్లాడారు. దేవీ శరన్నవరాత్రుల సందర్భంగా ఈ నూతన రథం ప్రారంభోత్సవం చేశారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

తెనాలి : 80085 73125 పొన్నూరు : 80085 73144

? పట్టణంలోని శ్రీనగర్‌లో సాగు నీటి కాలువపై గల వంతెన శిథిలావస్థకు చేరుకుంది. -శ్రీనివాసరావు
జవాబు: మరమ్మతులు నిర్వహించే విధంగా చూస్తాం. -అపర్ణ, సహాయ ఇంజినీర్

? బీఆర్‌నగర్‌లోని ఖాళీ స్థలంలో పిచ్చి మొక్కలు మెలిచాయి. విష సర్పాలు వస్తున్నాయని ఫిర్యాదు చేసినా ఎటువంటి చర్యలు చేపట్టలేదు. -పి.రంగారావు, బీఆర్‌నగర్
✔ స్థల యజమానులకు నోటీసులు జారీ చేసి తదుపరి చర్యలు తీసుకుంటాం. - శ్రీనివాసరావు, ప్రజారోగ్యశాఖాధికారి
-న్యూస్‌టుడే, పొన్నూరు

? పట్టణంలోని షరాఫ్‌బజార్, పాత ప్రభుత్వ వైద్యశాల రోడ్డు, ఇతర ప్రాంతాల్లో విద్యుత్తు నియంత్రిక వద్ద వ్యాపారాలు చేయటం, వాహనాలు నిలుపుతున్నారు. వానల వేళ ఆకస్మికంగా ప్రమాదాలు జరిగితే ప్రాణనష్టం సంభవించే అవకాశాలు ఉన్నాయి. -సుధాకర్, బోస్‌రోడ్డు
✔ క్షేత్ర స్థాయిలో పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటాం -అశోక్‌కుమార్, విద్యుత్తు విభాగ డీఈ

? గంగానమ్మపేట పాత శివాలయం వెనుక గేటు మలుపులో వ్యర్థాల గుట్టలు పేరుకుంటున్నాయి. ఇది రద్దీ మార్గం. దుర్వాసన, దోమలతో ఇబ్బంది పడుతున్నాం. -పల్లవి, గంగానమ్మపేట
✔ వ్యర్థాలను సత్వరం తొలగించ చేస్తాం. -బి.శేషన్న, మున్సిపల్ కమిషనర్
-న్యూస్‌టుడే, తెనాలి టౌన్

స్పందనకు వందనం

వీధి దీపాలు వెలిగాయి: పట్టణంలోని నాజర్‌పేట సింగ్ రోడ్డులో వీధి దీపాలు వెలగటం లేదని 'మేమున్నాం... మీకు తోడుగా' శీర్షికన ఈ నెల 10న కథనం ప్రచురితమవ్వడంతో అధికారులు స్పందించి వీధి దీపాలు వెలిగింప చేశారు.

వ్యర్థాల తొలగింపు.. మేమున్నాం...మీకు తోడుగా శీర్షికన ఈనాడులో ప్రచురితమైన కథనానికి ప్రజారోగ్యశాఖాధికారులు స్పందించారు. సాయినగర్‌లో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించారు. **-న్యూస్‌టుడే, తెనాలి టౌన్, పొన్నూరు**

పోలీస్ అవుట్ పోస్టులు వినియోగంలోకి వచ్చేదెన్నడు?

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: డివిజన్ కేంద్రం తెనాలిలో జనం రాకపోకలు, స్థానికంగా కాలనీల విస్తరణ నేపథ్యంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, శాంతి భద్రతల పరిరక్షణకు 13 సంవత్సరాల కిందట పట్టణ పరిధిలో మూడు చోట్ల పోలీస్ అవుట్ పోస్టులను ఏర్పాటు చేశారు. మార్కెట్ కూడలి, మారీసుపేట రెండు గేట్ల నడుమ, తెనాలి-గుంటూరు మార్గంలో జెఎంజె కళాశాల వద్ద ఇవి నిర్మితమయ్యాయి. ఆయా ప్రాంతాల నుంచి పోలీస్ స్టేషన్లు దూరంగా ఉన్న క్రమంలో ఈ పోస్టుల వద్ద కనీసం పోలీసులు అందుబాటులో ఉంటే చాలా వరకు ప్రజల ఇబ్బందులకు పరిష్కారం లభించటంతో పాటు, దగ్గరలో పోలీస్ ఉన్నారన్న ధైర్యం వారికి ఉంటుందన్నది నాటి ఆలోచన.

☆ మార్కెట్ ప్రాంతంలో ట్రాఫిక్ చూసుకోవడంతో పాటు చోరీల నియంత్రణకు అవకాశం ఉంటుంది. మారీసుపేట ప్రాంతంలో పోస్టు మరింత ప్రాధాన్యం సంతరించుకుంది. శివారు ప్రాంతం కావటం, జనం ఎక్కువగా ఉండే కాలనీలు, బహిరంగ మద్యపానం, గంజాయి వినియోగం, తరుచూ గొడవలు వంటి వాటికి ఇది అడ్డా. పోలీస్ రికార్డుల్లోనూ ఇది సమస్యాత్మక ప్రాంతం. ఈ పోస్టులను ప్రారంభించిన కొత్తల్లో పోలీస్ సిబ్బంది విడతల వారీగా విధులు నిర్వహించే వారు. స్థానికంగా గొడవలు నివారించడంతో పాటు ప్రజల నుంచి ఫిర్యాదులు అందుకుని ప్రధాన పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించే వారు. ఆ తర్వాత ఇవి వినియోగానికి దూరమయ్యాయి. గత కొన్ని సంవత్సరాలుగా వీటికి తాళాలు పడిపోయాయి.

☆ వైకాపా ఐదేళ్ల పాలనలోనూ వీటి గురించి పట్టించుకోలేదు. ఇప్పుడు వాటి చెంతనే బహిరంగ మద్యపానం జరుగుతున్న ఆనవాళ్లు క్షేత్ర స్థాయి పరిస్థితులకు దర్పణం. వ్యర్థాల గుట్టలకు ఆవాసంగా మారాయి. వాస్తవానికి గతంలో కంటే ఇప్పుడు ఈ తరహా పోస్టుల నిర్వహణ మరింత అవసరమన్నట్లుగా పరిస్థితులు ఉన్నాయి.

సిద్ధం చేసి కూడా.. తెనాలిలో పోలీస్ అవుట్ పోస్టులు నిరుపయోగంగా పడి ఉండటంపై గత ఏడాది జూన్ 18న 'మూణ్నాళ్లు మురిపించి...ఆపై మూసివేసి' శీర్షికన ఈనాడు కథనం ప్రచురించింది. స్పందించిన పోలీస్ అధికారులు మారీసుపేటలోని అవుట్ పోస్టును బాగు చేయించి, రంగులు కూడా వేయించారు. తొలిగా దానిని ప్రారంభించి మిగిలిన రెండింటిని కూడా దారిలో పెడతామని అధికారులు అప్పట్లో చెప్పారు. అప్పుడు బాగు చేయించింది కూడా ఇప్పుడు వృథాగానే పడి ఉంది.

ఒకే రోజు ఐదు దుకాణాల్లో చోరీలు: గత ఏడాది నవంబరు నెలలో మార్కెట్ కూడలిలోని ఒకే ప్రాంతంలోని ఐదు దుకాణాల్లో వరుసగా చోరీలు జరిగాయి. మార్కెట్ కూడలిలోని పోలీస్ అవుట్ పోస్టు వినియోగంలో ఉండి, సిబ్బంది అక్కడ ఉంటే ఈ చోరీలను నియంత్రించే వారని వ్యాపారులు అప్పట్లోనే చెప్పుకున్నారు. చోరీలు జరిగిన దుకాణాలన్నీ పోలీస్ పోస్టుకు అతి సమీపంలోనే ఉన్నాయి. పాలకులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.


తెనాలి మార్కెట్ కూడలిలో మూసి వేసి ఉన్న పోలీస్ అవుట్ పోస్టు


మారీసుపేట రెండు గేట్ల నడుమ పునఃప్రారంభానికి నోచక..

అన్నదానం

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే: దేవీ శరన్నవరాత్రుల ఉత్సవాల ముగింపు సందర్భంగా ఆదివారం పట్టణంలోని పలు ఆలయాల వద్ద అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. భక్తుల సందర్శనార్థం అమ్మవారిని ప్రత్యేక వాహనాలపై ఊరేగించారు. భక్తులు అమ్మకు కానుకలు అందజేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

భాజపా సభ్యత్వ నమోదు

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: భాజపా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆదివారం పట్టణం, మండలంలో నిర్వహించారు. కార్యక్రమాన్ని పాండురంగ విఠల్, కఠారి వాసుదేవ నాయుడు పర్యవేక్షించారు.

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ సూచనల మేరకు ప్రధాన విద్యుత్తు లైన్ల మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు పనులు ప్రారంభించిస్తున్నట్లు విద్యుత్తు విభాగ ఏఈ వెంకటసుధీర్ తెలిపారు. పనుల నేపథ్యంలో సోమవారం పట్టణ పరిధిలోని జయప్రకాష్‌నగర్, వీఎస్ఆర్ కళాశాల రోడ్డు, బస్టాండ్ ప్రాంతాల్లో ఉదయం 7 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: క్లాసిక్ స్పోర్ట్స్ ఎరీనా క్రికెట్ టోర్నమెంటును తెనాలి బుర్రిపాలెం రోడ్డులోని మైదానంలో ఆదివారం డాక్టర్ ఆలపాటి సందీప్ ప్రారంభించి క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ నెల 15వ తేది వరకు పోటీలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో సమీర్, అమీర్‌సొహైల్, అమీర్‌షకీల్, రేవంత్, తరుణ్, అక్షయ్, చాణక్య తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులకు ఉచిత దుస్తుల పంపిణీ

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే: 15వ వార్డు కౌన్సిలర్ గుంటూరు కోటేశ్వరరావు ఆధ్వర్యంలో ఆదివారం వైకాపా కార్యాలయంలో మున్సిపల్ కార్మికులకు ఉచితంగా దుస్తులు పంపిణీ చేశారు. అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ పేరం సంజీవరెడ్డి, జనసేన నాయకులు జిడుగు తులసీరామ్, మాజీ కౌన్సిలర్ కుక్కల వాసు పాల్గొన్నారు.

రాయితీ ధరలపై వంట నూనెలు

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం, పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ సూచనలతో రాయితీ ధరలపై ప్రజలకు నూనె ప్యాకెట్లు అందిస్తామని తెనాలి నూనె వ్యాపారులు తెలిపారు. ఆదివారం ఇక్కడ విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ దేశీయంగా నూనె గింజల సాగును ప్రోత్సహించటానికి కేంద్ర ప్రభుత్వం దిగుమతి సుంకం పెంచటం వల్ల వంట నూనెలపై లీటరుకు రూ. 17 నుంచి రూ.20 వరకు భారం పడిందన్నారు. మంత్రి మనోహర్ ఆయిల్ అసోసియేషన్లతో స్నేహపూర్వక సమావేశం ఏర్పాటు చేసి నూనె ధరల నియంత్రణపై చర్చించిన నేపథ్యంలో తెనాలిలోని 18 ఆయిల్ , రైతు బజార్లలోని దుకాణాలన్నింటిలోనూ లీటరు పామాయిల్ రూ.110, సన్‌ఫ్లవర్ ఆయిల్ రూ.124కు ప్రజలకు అందుబాటులో ఉంచామని వివరించారు. సమావేశంలో మురళీమోహన్, సుబ్బారావు, వెంకటసుధీర్, జగన్‌మోహన్, భరత్, మహేష్, చైతన్య, మనోహర్, మణికంఠ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రైతుల ఆదాయం పెంచుతాం


రైతులకు తైవాన్ స్ప్రేయర్లను అందిస్తున్న ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్

పొన్నూరు, న్యూస్‌టుడే: మాజీ రెవెన్యూ శాఖ మంత్రి ధూళిపాళ్ల వీరయ్య చౌదరి రైతు ఉత్పత్తిదారుల సమాఖ్య ఆధ్వర్యంలో రైతులు సాగుపై పెడుతున్న ఖర్చులను తగ్గించి వారి ఆదాయ వనరులను పెంచే విధంగా తగు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ పేర్కొన్నారు. మునిపల్లెలో ఆదివారం మాజీ రెవెన్యూశాఖ మంత్రి ధూళిపాళ్ల వీరయ్య చౌదరి రైతు ఉత్పత్తిదారుల సమాఖ్య కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం రైతు ఉత్పత్తిదారుల సమాఖ్య ఆధ్వర్యంలో 72 మంది రైతులకు తైవాన్ స్ప్రేయర్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన విత్తనాలు, పురుగుమందులు అందించడంతో పాటు రైతులకు కావాల్సిన సౌకర్యాలు కల్పిస్తామని వెల్లడించారు. రైతులు సాగు చేసిన పొలాల్లో డ్రోన్ల సహకారంతో పురుగుమందులు, ఎరువులను పిచికారీ చేసే విధంగా తగు చర్యలు తీసుకోవాలని సమాఖ్య సభ్యులకు సూచించారు. కేంద్ర ప్రభుత్వం, రైతుల భాగస్వామ్యంతో రైస్ మిల్లును నిర్మించి వినియోగదారుడికి నాణ్యమైన బియ్యం అందించేలా తగు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు వడ్రాణం మార్కండేయబాబు,మదాల వెంకటేశ్వర్లు, బొర్రు రామారావు, వెన్నం నాయుడు, బండ్లమూడి బాబురావు తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ కాసరనేని సేవలు చిరస్మరణీయం


డాక్టర్ సదాశివరావు విగ్రహానికి పూలమాల వేస్తున్న డాక్టర్ వాసిరెడ్డి

తక్కెళ్లపాడు (పెదకాకాని), న్యూస్‌టుడే: ప్రముఖ శస్త్ర వైద్య నిపుణుడు డాక్టర్ కాసరనేని సదాశివరావు సేవలు చిరస్మరణీయమని డాక్టర్ వాసిరెడ్డి నాగేశ్వరప్రసాద్ తెలిపారు. డాక్టర్ కాసరనేని సదాశివరావు జయంతి సందర్భంగా ఆదివారం తక్కెళ్లపాడు జాతీయ రహదారి వెంబడి ఉన్న ఆయన విగ్రహానికి వాసిరెడ్డి నాగేశ్వరప్రసాద్ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. వైద్యం, విద్య, కళారంగ అభివృద్ధితో పాటు పేదల అభ్యున్నతికి సదాశివరావు చేసిన సేవలు గుర్తు చేశారు.

నేటి నుంచి ఉరుసు మహోత్సవాలు

తాడికొండ,న్యూస్‌టుడే: తాడికొండ మండలం నిడుముక్కల గ్రామం దర్గాలో ఉరుసు మహోత్సవాలను సోమవారం నుంచి ప్రారంభమవుతున్నాయని దర్గా ముజావర్ షేక్ షబ్బీర్ బాషా తాజ్ వుల్ ఖాద్రి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 71 ఏళ్లగా ఏటా ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు.

అపురూపం.. జగన్మాత దర్శనం


బోసురోడ్డు: వాసవీమాత


సంగంజాగర్లమూడిలో..


పొన్నూరులో ఊరేగింపు


డ్రైఫ్రూట్స్‌తో తోటమ్మతల్లి


పొన్నూరు: కన్యకాపరమేశ్వరి


ములుకుదురులో ..


నందివెలుగులో త్రిభువనేశ్వరీదేవిగా


పెదకాకానిలో రాజరాజేశ్వరి


గంగానమ్మపేట సౌందర్యలహరి, లలిత


కొల్లిపర: కోలాటం


తెనాలి: వాసవీ అమ్మవారి రథాన్ని లాగుతున్న భక్తులు



గుడ్లవల్లేరు: వేమవరం కొండలమ్మ దేవస్థానంలో తెనాలి న్యాయమూర్తి రాజశేఖర్ దంపతులు


మారీసుపేటలో బతకమ్మ ఊరేగింపు


శలపాడులో నిమజ్జనానికి తరలివెళుతున్న దుర్గమ్మ తల్లి

దేవీ శరన్నవరాత్రుల ఉత్సవాలు శనివారంతో ఘనంగా ముగిశాయి. తెనాలి, పొన్నూరు నియోజకవర్గాల్లోని అమ్మవారి కోవెలలు భక్తులతో కిటకిటలాడాయి. మహిషాసురమర్దిని, మహాకాళికాదేవి తదితర అలంకారాల్లో అమ్మ భక్తులకు దర్శనమిచ్చారు. ప్రతిమలు, ఉత్సవ విగ్రహాలను పురవీధుల్లో ఊరేగించారు. మహిళలు బతకమ్మను ఊరేగించారు. అర్చకులు కలశాభిషేకం, చండీహోమం, మహిళ కుంకుమ పూజలు నిర్వహించారు. **-న్యూస్‌టుడే, బృందం**

ఏఎన్‌యూలో ముగిసిన ఎన్‌సీసీ శిబిరం


శిక్షణలో ఎన్‌సీసీ క్యాడెట్స్

ఎ.ఎన్.యు: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో వారం రోజుల నుంచి జరుగుతున్న ఎన్‌సీసీ శిక్షణా శిబిరం ఆదివారంతో ముగిసింది. ఈ శిబిరంలో సత్తా చాటిన వారికి బహుమతులు అందజేశారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న 25వ ఆంధ్ర బెటాలియన్ కమాండింగ్ కల్నల్ సిద్దూ మాట్లాడుతూ శిక్షణ తీసుకున్న సిబ్బంది సమాజంపై బాధ్యతతో వ్యవహరించాలని కోరారు. సమాజంలోని బిన్న సంస్కృతులు, సంప్రదాయాలను గౌరవించాలని సూచించారు. క్రీడల ద్వారా శారీరకంగా దృఢంగా తయారవుతారని, అందుకే క్రీడా పోటీలు నిర్వహించామన్నారు. క్యాడెట్స్ మధ్య స్నేహపూర్వక వాతావరణం ఏర్పడేందుకు ఇలాంటి శిక్షణా శిబిరాలు ఉపయోగపడుతోందన్నారు. ఆర్మీ అధికారులు కల్నల్ దీపక్ కుమార్, మేజర్ విజయ్, దేవరాజన్, సెంథిల్‌కుమార్ పాల్గొన్నారు.

కాలువలో వృద్ధురాలి మృతదేహం

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: పట్టణ తూర్పు కాలువలో సుమారు 85 సంవత్సరాల వృద్ధురాలి మృతదేహాన్ని ఆదివారం స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పట్టణానికి చెందిన వృద్ధురాలిని అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతూ ఉంటే, కుటుంబ సభ్యులు తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తీసుకు వెళ్లగా.. అక్కడ చికిత్స సమయంలో ఆందోళనకు గురైన ఆమె వైద్యశాల నుంచి బయటకు వచ్చి ఆటో ద్వారా కాలువ వరకు వచ్చి దూకినట్లు తెలుస్తోంది. పోలీసులు విచారణ చేస్తున్నారు.

ఇంట్లో చోరీ

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: స్థానిక బాలాజీరావుపేటలో నివాసిత కుటుంబం దసరా సెలవుల నేపథ్యంలో రామేశ్వరం వెళ్లారు. శనివారం రాత్రి ఇంటికి వచ్చి చూడగా తలుపులకు వేసిన తాళం పగులగొట్టి ఉంది. లోపల బీరువాలో ఉండాల్సిన సుమారు 6 సవర్ల బంగారు నగలు, కొంత నగదు చోరికి గురైనట్లు గుర్తించి త్రీ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. క్లూస్ బృందం వచ్చి ఆధారాలు సేకరించింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అదృశ్యంపై ఫిర్యాదు

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: పట్టణ రామలింగేశ్వరపేటకు చెందిన 85 సంవత్సరాల నాగేంద్రమ్మ కుటుంబ సభ్యులపై అలిగి ఈ నెల 9న ఇంటి నుంచి వెళ్లి ఇప్పటి వరకు తిరిగి రాలేదని కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేసినట్లు వన్‌టౌన్ పోలీసులు ఆదివారం తెలిపారు.

గోతుల మయం.. ప్రయాణం నరకం

పొన్నూరు మండలం గాయంవారిపాలెం నుంచి మోదుకూరుకు వెళ్లే రహదారి గోతులమయంగా మారడంతో రాకపోకలు నిర్వహించడానికి వాహనదారులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. వాహనాలు గోతుల్లో పడి వాహనాలు అదుపు తప్పి ప్రమాదాల బారిన పడుతున్నారు. ఎటువంటి ప్రాణ నష్టం జరగకముందే అధికారులు మేల్కొని మరమ్మతులు నిర్వహించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని వాహనదారులు డిమాండ్ చేస్తున్నారు.
- న్యూస్‌టుడే, పొన్నూరు



ప్రభుత్వం మారినా.. లోగో మారలేదు

పొన్నూరు మండలం వడ్డిముక్కల పంచాయతీలో నూతనంగా నిర్మించిన సచివాలయంపై మాజీ సీఎం జగన్ మోహన్‌రెడ్డి ఫొటోతో పాటు నవరత్నాల లోగో కొనసాగడంపై విమర్శలు వెలువడుతున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరవాత కూడా ఇలా ఉండటంపై కొందరు స్థానికులు పంచాయతీ అధికారులు వద్ద అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా మండల అధికారులు స్పందించి లోగోను తొలగించేలా తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. **-న్యూస్‌టుడే, పొన్నూరు**



శ్రీవారి సేవలో హైకోర్టు న్యాయమూర్తులు

తిరుమల: శ్రీవారిని ఏపీ హైకోర్టు న్యాయమూర్తులు శనివారం దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో శ్రీవారి మూలమూర్తిని ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి, జస్టిస్ రవినాథ్ తిల్హరిలు వారివారి కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం అందించగా తితిదే అధికారులు తీర్థప్రసాదాలు అందజేశారు.

చిగురు మేఘం.. స్వేచ్ఛ రాగం


అతిథులు, నిర్వాహకులు నుంచి ఉత్తమ సాంఘిక నాటకం ప్రదర్శన పురస్కారం అందుకుంటున్న చిగురు మేఘం కళాకారులు, ఉత్తమ సాంఘిక నాటిక ప్రదర్శన పురస్కారం అందుకుంటున్న స్వేచ్ఛ కళాకారులు

తెనాలి (కొత్తపేట), న్యూస్‌టుడే: కళల కాణాచి (తెనాలి), వేదగంగోత్రి ఫౌండేషన్ (విజయవాడ) సంయుక్త ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో ఈనెల 7వ తేదీ నుంచి చేపట్టిన వీణా పురస్కారాల, నాటకోత్సవాలు-2024), ఎ.ఆర్.కృష్ణ, బుర్రా సుబ్రహ్మణ్య శాస్త్రి జాతీయ రంగస్థల పురస్కారాల ప్రదాన కార్యక్రమం ఆదివారంతో ముగిసింది. ఈ సందర్భంగా జాతీయ స్థాయి సమకాలీన పద్య నాటక వ్యక్తిగత బహుమతులు, సాంఘిక నాటక, నాటిక పోటీల ఫలితాలను వేర్వేరుగా ప్రకటించారు.

నాటిక విభాగంలో చిగురు మేఘం (గుంటూరు అమరావతి ఆర్ట్స్) ప్రథమ, నా శత్రువుకు (హైదరాబాద్ యువభేరి థియేటర్ ఆర్గనైజేషన్) ద్వితీయ, మతమా మానవత్వమాకు (శ్రీకాకుళం లలిత శ్రీ కళాసమితి) తృతీయ ఉత్తమ ప్రదర్శనలుగా నిలిచాయి.

సాంఘిక నాటకం విభాగంలో స్వేచ్ఛకు (హైదరాబాద్ విశ్వశాంతి కల్చరల్ అసోసియేషన్) ప్రథమ, మంత్రనగరి (ఉక్కు నగరం చైతన్య కళా స్రవంతి) ద్వితీయ ఉత్తమ ప్రదర్శనలుగా వచ్చాయి.

పద్య నాటకం విభాగంలో వ్యక్తిగతంగా బహుమతులు ఇచ్చారు. బహుమతుల ప్రదానోత్సవంలో మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్, కళల కాణాచి గౌరవాధ్యక్షుడు డాక్టర్ బాబూ ఆర్ వడ్లమూడి, కళల కాణాచి ముఖ్య సలహాదారు మునగాల శ్యాంప్రసాద్, అధ్యక్షుడు బుర్రా సాయిమాధవ్, ఆర్.ఎస్.ఆర్.గ్రూప్స్ ఛైర్మన్ ఆర్.శ్రీకాంత్ రెడ్డి, వేదగంగోత్రి ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు జీవీఎన్ఆర్ఎస్ఎస్ వరప్రసాద్ పాల్గొన్నారు.

పౌరాణిక నటులు గోపాలరావుకు రంగస్థల పురస్కారం ప్రదానం


అతిథుల నుంచి పురస్కారం అందుకుంటున్న నటుడుయడ్ల గోపాలరావు

తెనాలి (కొత్తపేట), న్యూస్‌టుడే: ప్రముఖ రంగస్థల పౌరాణిక నటులు విజయనగరం జిల్లా మందరాడకు చెందిన యడ్ల గోపాలరావుకు బుర్రా సుబ్రహ్మణ్యశాస్త్రి జాతీయ రంగస్థల పురస్కారం ప్రదానం చేశారు. ఆదివారం రాత్రి తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ఈ పురస్కారాన్ని ఆయనకు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి కళల కాణాచి ఉపాధ్యక్షుడు చెరుకుమల్లి సింగారావు అధ్యక్షత వహించారు. కళల కాణాచి గౌరవాధ్యక్షుడు బాబు ఆర్.వడ్లమూడి, ముఖ్య సలహాదారు మునగాల శ్యాంప్రసాద్, మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఆర్.ఆర్.గ్రూపు సంస్థల ఛైర్మన్ ఆర్. శ్రీకాంత్‌రెడ్డి, పట్టణ రంగస్థల అధ్యక్షురాలు బుర్రా జయలక్ష్మి, వేదగంగోత్రి ఫౌండేషన్ (విజయవాడ) వ్యవస్థాపక అధ్యక్షుడు బీవీఎన్ఆర్ ఎస్ఎస్ఎస్ వరప్రసాద్, కళల కాణాచి వ్యవస్థాపక అధ్యక్షుడు బుర్రా సాయిమాధవ్ పురస్కారాన్ని గోపాలరావుకు ప్రదానం చేసి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కళల కాణాచి ప్రధాన కార్యదర్శి గోపరాజు విజయ్, కోశాధికారి దేవరపల్లి భవాని, అయినాల మల్లేశ్వరరావు, సహాయకార్యదర్శి అయినాల మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

నటుడు ఆదినారాయణకు...


సాయిమాధవ్ నుంచి వీణా పురస్కారం అందుకుంటున్న సంగీత దర్శకుడు ఆదినారాయణరావు

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే: తెనాలికి చెందిన ప్రముఖ పౌరాణిక నటుడు ఏవీ ఆదినారాయణరావుకు ఉత్తమ సంగీత దర్శకుడు వీణా పురస్కారం లభించింది. ఈయన వారం పాటు తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో నిర్వహించిన జాతీయ స్థాయి పద్య నాటక పోటీల్లో ప్రదర్శించిన అష్టమ వసుపు నాటకానికి సంగీత దర్శకత్వం నిర్వహించారు. కళలకాణాచి అధ్యక్షుడు సాయిమాధవ్ చేతులమీదుగా వీణా పురస్కారం అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన్ను నాయుడు గోపి తదితర కళాకారులు ఆదివారం అభినందించారు.

గుంటూరు తూర్పు

అరుణాచలానికి ప్రత్యేక బస్సు

పట్నంబజారు, న్యూస్‌టుడే: పౌర్ణమి సందర్భంగా ఈనెల 17న అరుణాచలానికి చేరేందుకు ప్రత్యేక బస్సు ఏర్పాటు చేస్తున్నట్లు గుంటూరు-1 డిపో మేనేజర్ రామకృష్ణ ప్రకటనలో తెలిపారు. ఈనెల 15న ప్రత్యేక బస్సు గుంటూరు బస్టాండు నుంచి బయలుదేరి 16న శ్రీకాళహస్తి, కాణిపాకం, శ్రీపురం గోల్డెన్ టెంపుల్ దర్శించుకొని అదేరోజు రాత్రి అక్కడి నుంచి బయలుదేరి 17వ తేదీన అరుణాచలంకు చేరుకుంటుందన్నారు. అరుణాచలంలో దర్శన అనంతరం అక్కడి నుంచి రాత్రి 7గంటలకు బయలుదేరి 18వ తేదీ ఉదయం 7గంటలకు గుంటూరు బస్టాండుకు చేరుకుంటుందని ఆయన పేర్కొన్నారు. టికెట్లను ఆన్‌లైన్‌లో రిజర్వేషన్ చేయించుకోవాలన్నారు. ఇతర వివరాలకు 73828 89830ను సంప్రదించాలన్నారు.



ఎన్టీఆర్ రైతుబజారులో ధరలు నిన్నటివి... (కిలో ఒక్కింటికి రూ.ల్లో) టమాట 50, వంగ 23, బెండ 24, పచ్చిమిర్చి 19, కాకర 25, క్యారెట్ 40, క్యాలిఫ్లవర్ 38, క్యాబేజీ 24, బీర 28, దొండ 30, బంగాళదుంప 39, ఉల్లిపాయలు 32, గోరుచిక్కుళ్లు 28, దోస 25, పొట్ల 32, మునగ 8, పెద్ద చిక్కుళ్లు 64, చామదుంప 40, మునగ రూ. 8, గోంగూర 10, తోటకూర 10, కొత్తిమీర 25, బీట్‌రూట్ 28, కీర 34, క్యాప్సికం 64, అల్లం 60, ఫ్రెంచి బీన్స్ 94, సొర 16, అరటి 7 **-న్యూస్‌టుడే, పట్నంబజారు**

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

94406 38515, 80085 73097

? వసంతరాయపురం ఒకటో లైన్‌లో విద్యుత్తు తీగల కింద ఉన్న చెట్లకొమ్మలు పదిరోజుల క్రితం కొట్టి పడేశారు. దీంతో పరిసరాలు అపరిశుభ్రంగా మారి ఇబ్బందులు పడుతున్నాం. **- ప్రసాద్**

✔ యానాదికాలనీ 1, 2 లైన్లలోని సైడుకాల్వల్లో సిల్ట్ తీయకపోవడంతో మురుగునీరు పారక దోమల వ్యాప్తి అధికమైంది.

- స్థానికులు

✔ చెట్లకొమ్మలు, చెత్త తొలగించేందుకు చర్యలు తీసుకుంటాం. వెంటనే కాల్వలు శుభ్రం చేయిస్తాం.

- అయూబ్‌ఖాన్, శానిటరీ సూపర్‌వైజర్

- న్యూస్‌టుడే, నగరపాలకసంస్థ(గుంటూరు)

ఆదాయ వనరులపై దృష్టి ఏదీ?

నగరపాలక సంస్థ (గుంటూరు), న్యూస్‌టుడే

నగరపాలకసంస్థ పరిధిలో అనేక ఆదాయవనరులు ఉన్నా ఏళ్ల తరబడి కమిషనర్లు వస్తున్నారు.. వెళ్తున్నారు తప్పా వాటిపై ఇసుమంతైనా అధికారులు దృష్టి సారించడంలేదు. తూర్పు నియోజకవర్గంలో బీఆర్ స్టేడియం ఎదురుగా ఉండే రెడ్ ట్యాంకు దుకాణ సముదాయానికి కొత్త రూపు తీసుకొచ్చి దాన్ని నగరపాలకసంస్థకు ఆదాయవనరుగా మార్చాలని ఏ అధికారి ఆలోచన చేయడంలేదు. సమీక్షల్లో భాగంగా ఆదాయ వనరులపై దృష్టి పెట్టాలి.. అభివృద్ధి పనులకు నిధులే కీలకం అంటూ మాటలు మాత్రమే చెప్తున్నారు తప్పా పనులు ముందుకు సాగడంలేదని ప్రాంతవాసులు నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కొన్ని అభివృద్ధి పనులు చేపట్టడంతో ఇప్పటికైనా జీఎంసీకి ఆదాయం పెంచుకునేందుకు మధ్యలో నిలిచిపోయిన భవనాల పనులు పూర్తి చేయాల్సి ఉంది.



నిరుపయోగంగా దుకాణాల సముదాయం

రెండు దశాబ్దాలుగా కదలని పనులు..

ఆర్టీసీ బస్టాండ్ ఎన్టీఆర్ కూడలికి సమీపంలోనే ఉండే రెడ్ ట్యాంకు దుకాణ సముదాయం రెండు దశాబ్దాలకు ముందు సువిశాల స్థలంలో జీ-2 నిర్మాణానికి శ్లాబులు వేసి కొంత వరకు పూర్తి చేసి అలాగే వదిలేశారు. అప్పట్లోనే రూ.50 లక్షలకుపైగా ఖర్చు చేసి తర్వాత నిధుల లేమితో నిర్మాణాలు ఆపేశారు. ఈ ప్రాంతంలో స్థలం విలువ గజంకు రూ.80 వేలకుపైగానే ఉంటుంది. అటువంటి విలువైన స్థలంలో సగం చేసిన నిర్మాణాలను జీఎంసీ అధికారులు పూర్తి చేయకుండా వదిలేయడం వల్ల నిరుపయోగంగా ఉన్నాయి.

వినియోగంలోకి వస్తే ఆదాయమే..

రెడ్ ట్యాంక్ దుకాణ సముదాయానికి మరమ్మతులు చేసి వినియోగంలోకి తెస్తే జీఎంసీకి ఆదాయం వచ్చే అవకాశాలున్నాయి. ఇక్కడ ఒక్కో ఫ్లోర్‌లోనే వంద దుకాణాలు ఏర్పాటు చేస్తూ మొత్తం 250 నుంచి 300 వరకు ఏర్పాటు చేసేందుకు వీలుంటుందని భావిస్తున్నారు. ప్రాధాన్యత కలిగిన ప్రాంతం కావడంతో వ్యాపార దుకాణాలకు డిమాండ్ అధికంగా ఉండే అవకాశం ఉంటుంది. పార్కింగ్‌కు అనువుగా ఇక్కడ స్థలం అందుబాటులో ఉన్నందున జీఎంసీ ఆధ్వర్యంలో రెడ్‌ట్యాంక్ దుకాణ సముదాయాన్ని ఆధునీకరించేందుకు చర్యలు చేపడితే ఆదాయం పెరిగే అవకాశం ఉందని పలువురు పలువురు విజ్ఞప్తిచేస్తున్నారు.

భారత్ ప్రగతిలో టాటాల పాత్రపై 20న చర్చాగోష్ఠి

గుంటూరు నగరం, న్యూస్‌టుడే: భారత్ ప్రగతిలో టాటాల పాత్రపై ఈనెల 20వ తేదీన చర్చాగోష్ఠి ఏర్పాటుచేసినట్లు జనచైతన్య వేదిక అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి ప్రకటనలో తెలిపారు. రామన్నపేటలోని జనచైతన్య వేదిక కార్యాలయంలో జరిగే ఈ చర్చాగోష్ఠిలో నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, రాష్ట్ర ప్రణాళిక సంఘం మాజీ ఉపాధ్యక్షుడు చెరుకూరి కుటుంబరావు, మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్ తదితరులు పాల్గొంటారని పేర్కొన్నారు. భారతదేశానికి అత్యున్నత సేవలు అందించిన పారిశ్రామిక దిగ్గజం రతన్‌టాటాకు నివాళులర్పించనున్నట్లు ఆయన తెలిపారు.

ఆక్రమణలు తొలగించండి

నగరపాలకసంస్థ(గుంటూరు), న్యూస్‌టుడే: రహదారి, డ్రెయిన్‌ల మీద ఆక్రమణలను వెంటనే తొలగించేందుకు చర్యలు చేపట్టాలని కమిషనర్ పి.శ్రీనివాసులు ఆదేశించారు. జీజీహెచ్, రైల్వేస్టేషన్ రోడ్డు, ఓల్డ్‌క్లబ్‌రోడ్డు ప్రాంతాల్లో ఆదివారం డ్రెయిన్‌లపై ఆక్రమణలు, పారిశుద్ధ్య పనులు తనిఖీ చేశారు. కమిషనర్ మాట్లాడుతూ డ్రెయిన్‌లపై ఆక్రమణల వల్ల పూడికలు తీయక చెత్త, వ్యర్థాలు అడ్డుపడి వర్షం నీరు రహదార్ల మీదకు, ఇళ్లలోకి వెళ్లి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వాటిని తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. ట్రాఫిక్‌కు ఆటంకం కలిగించే విధంగా ఉన్న రహదార్ల మార్జిన్‌ల వద్ద ఆక్రమణలను కూడా తొలగించాలని ఆదేశించారు. డ్రెయిన్‌లకు వెనుక వైపు మాత్రమే దుకాణాలు, వ్యాపారాలు ఉండేలా చూసుకోవాలని చెప్పారు.

బహిరంగ సభ జయప్రదం చేయండి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు, సాంబయ్య, రమాదేవి, వెంకటేశ్వర్లు

నెహ్రూనగర్, న్యూస్‌టుడే: రజక జనసేవాసంఘం ఆధ్వర్యంలో ఈ నెల 19న పాతగుంటూరులోని గంగానమ్మ కమ్యూనిటీ హాలులో నిర్వహిస్తున్న బహిరంగ సభను జయప్రదం చేయాలని రజక జనసేవాసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జూపూడి శ్రీనివాసరావు కోరారు. ఆదివారం బొంగరాలబీడులోని కార్యాలయంలో కరపత్రాలు ఆవిష్కరించారు. నాయకులు సాంబయ్య, రమాదేవి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

వాకింగ్ ట్రాక్‌ల అభివృద్ధికి కృషి

నెహ్రూనగర్, న్యూస్‌టుడే: తూర్పు నియోజకవర్గ పరిధిలో వాకింగ్ ట్రాక్‌ల అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్ అన్నారు. నెహ్రూనగర్ వాకర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎంపిక చేశారు. అధ్యక్షుడిగా వి.దుర్గారావు, ఉపాధ్యక్షుడిగా పి.వీరాస్వామి, ప్రధాన కార్యదర్శిగా వై.నాగేశ్వరరావు, కార్యదర్శులుగా కె.మల్లికార్జునరావు, శంకరరావు, సంయుక్త కార్యదర్శులుగా సుబ్బారెడ్డి, శ్రీనివాసరావు, కోశాధికారిగా సాయి తదితరులను ఎన్నుకున్నారు.



నూతన కార్యవర్గ సభ్యులతో ప్రమాణం చేయిస్తున్న ఎమ్మెల్యే నసీర్

పోలీసు కార్యాలయంలో ఆయుధపూజ



పూజలో ఉంచిన తుపాకులు



బాణం వేస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్, అధికారులు

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: పోలీసు కార్యాలయంలో శనివారం విజయదశమి సందర్భంగా ఆయుధ పూజ నిర్వహించారు. ముందుగా ఎస్పీ రాజ్యలక్ష్మి అమ్మవారికి, దుర్గాదేవికి పూజలు చేశారు. ఆయుధాగారంలోని వివిధ రకాల తుపాకులు ఉంచి పూజలు చేశారు. అనంతరం శమీ పూజలో భాగంగా జెమ్మికొట్టే కార్యక్రమంలో పాల్గొన్న ఎస్పీ బాణం వేశారు. ఏఎస్పీ హనుమంతు, డీఎస్పీలు జయరాం ప్రసాద్, అబ్దుల్ అజీజ్, సీతారామయ్య, సుబ్బారావు, శివాజీరాజు, సీఐలు శ్రీనివాసరావు, శ్రీహరి, వీరనాయక్, శివప్రసాద్, ఏఆర్ సిబ్బంది పాల్గొన్నారు.

నియామకపత్రం అందజేత



గుంటూరు వైద్యం, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ శరీర, అవయవ దాతల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా ఆచార్య రమణ యశస్వి శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన సర్వజనాసుపత్రి ఆర్థో విభాగం అధిపతిగా పని చేస్తున్నారు. గుంటూరులో జరిగిన ఓ కార్యక్రమంలో అఖిల భారత శరీర, అవయవ దాతల సంఘం వ్యవస్థాపకురాలు గూడూరు సీతామహాలక్ష్మి నియామకపత్రాన్ని అందజేసినట్లు యశస్వి రమణ తెలిపారు. ఇప్పటి వరకు జిల్లా అధ్యక్షుడిగా పని చేస్తున్నట్లు తెలిపారు.

అన్ని రకాల పుస్తకాలు అందుబాటులోకి తెస్తాం

కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే: ప్రాంతీయ గ్రంథాలయంలో అవసరమైన అన్ని రకాల పుస్తకాలను అందుబాటులోకి తీసుకొస్తామని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. ఏసీ కళాశాల రోడ్డులోని ప్రభుత్వ ప్రాంతీయ గ్రంథాలయాన్ని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని ఆదివారం సందర్శించారు. గ్రంథాలయం శిథిలావస్థలో ఉండడం, స్లాబ్ పెచ్చులూడి ఉండడాన్ని గమనించి భవనం నిర్మాణం, నిర్వహణ తదితర వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.

విద్యార్థులతో మాటామంతి: గ్రంథాలయంలో చదువుకుంటున్న విద్యార్థులతో పెమ్మసాని మాట్లాడారు. ఇక్కడ అన్ని పుస్తకాలు దొరుకుతున్నాయా? చదువుకోవడానికి సౌకర్యంగా ఉందా? అని ఆయన ప్రశ్నించారు. కార్యక్రమంలో గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో హైకోర్టు న్యాయమూర్తులు

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారిని ఏపీ హైకోర్టు న్యాయమూర్తులు శనివారం దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో శ్రీవారి మూలమూర్తిని ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి, జస్టిస్ రవినాథ్ తిల్హరిలు వారివారి కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం అందించగా తితిదే అధికారులు తీర్థప్రసాదాలు అందజేశారు.

ప్రజాఫిర్యాదుల స్వీకరణ నేడు

నగరపాలకసంస్థ, న్యూస్‌డే : ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా సోమవారం కౌన్సిల్ హాల్‌లో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించనున్నట్లు కమిషనర్ శ్రీనివాసులు ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఫిర్యాదులు స్వీకరణ ఉంటుందని పేర్కొన్నారు.



వీవర్స్‌కాలనీ: ఉమామహేశ్వర ఆలయంలో..



లాలాపేట: పుష్పశయ్య అలంకరణ



కొత్తపేట శివాలయంలో..



జెండాచెట్టు వద్ద దీపాలంకరణ



చినమహాలక్ష్మి ఆలయంలో కోలాటం

అమ్మపరమేశ్వరి.. ఆదిపరాశక్తి



కాకానిరోడ్డులో చండీదేవి

పట్నంబజారు, నెహ్రూనగర్, న్యూస్‌టుడే: నగరంలో విజయదశమి వేడుకలు శనివారం వైభవంగా నిర్వహించారు. లాలాపేట వెంకటేశ్వరస్వామి ఆలయం, జగన్నాథస్వామి ఆలయం, కొత్తపేట శివాలయంతోపాటు, పొన్నూరురోడ్డు, లాంచెస్టర్‌రోడ్డు, రెడ్లబజారు, పాతగుంటూరు, తదితర ప్రాంతాల్లోని ఆలయాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. ఆలయాల్లో జెమ్మిచెట్టుకు శమీ పూజలు చేశారు. బుచ్చయ్యతోటలో అమ్మవారిని పులివాహనంపై ఊరేగించారు. కాకానిరోడ్డులోని అమ్మవారి ఆలయంలో 11 కిలోల లడ్డూ ప్రసాదాన్ని నిర్వహించిన వేలంపాటలో భక్తుడు శ్రీనివాసరావు రూ.1.26 లక్షలకు దక్కించుకున్నట్లు అర్చకులు రామకృష్ణ తెలిపారు.



లాంచెస్టర్‌రోడ్డు: కనకదుర్గ తెప్పోత్సవం



గాంధీబొమ్మ కూడలిలో..



బుచ్చయ్యతోటలో ..



లాలాపేటలో జెమ్మిచెట్టుకు బాణం వేస్తున్న ఏసీ సుభద్ర



క్లాత్‌బజారు సెంటర్‌లో..



వినోభనగర్‌లో అమ్మవారికి పూజలు



వేలంలో దక్కించుకున్న లడ్డూతో భక్తుడు

వైభవంగా సాయిబాబా మహాసమాధి వేడుక



నెహ్రూనగర్, న్యూస్‌టుడే: గణేశ్వరరావువీధిలోని సాయిబాబా ఆలయంలో దసరా పండుగ రోజు షిర్డీ సాయిబాబా మహాసమాధి వేడుక వైభవంగా నిర్వహించారు. వేకువజామున అర్చకులు చైతన్య శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. నిర్వాహకులు లక్ష్మీనరసింహరావు ఉత్సవ ఏర్పాట్లు పర్యవేక్షించారు. సభ్యులు సుబ్బారావు, మల్లికార్జునరావు, శంకర్, గోపాల్, ప్రమీల, పద్మజ, సునీత, మాలతి పాల్గొన్నారు.

విశ్రాంత పోలీసుల సమస్యలు పరిష్కరిస్తా



ఎస్పీ సతీష్ కుమార్‌ను కలిసిన సత్యనారాయణ, చక్రపాణి, నారాయణ

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: జిల్లా ఎస్పీ సతీష్ కుమార్‌ను ఆదివారం తన కార్యాలయంలో విశ్రాంత పోలీసు అధికారుల సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. దసరా శుభాకాంక్షలు తెలిపి శాలువతో సత్కరించారు. ఎస్పీ మాట్లాడుతూ.. విశ్రాంత పోలీసు అధికారులకు పెన్షన్‌లు, ఇతర విషయాలలో ఏ సమస్య వచ్చినా తనను కలిస్తే వాటి పరిష్కరిస్తామని తెలిపారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కాళహస్తి సత్యనారాయణ, నాయకులు చక్రపాణి, కేవీ నారాయణ, వైటీ నాయుడు, రమేష్, రవికుమార్ ఉన్నారు.

పట్టభద్రులంతా ఓటరుగా నమోదు కావాలి



ఓట్ల నమోదు కేంద్రం ప్రారంభంలో పాల్గొన్న పాండురంగవరప్రసాద్, బసవలింగారావు తదితరులు

నగరపాలకసంస్థ(గుంటూరు), న్యూస్‌టుడే: ఉమ్మడి గుంటూరు, కృష్ణా జిల్లాల పట్టభద్రుల శాసన మండలి ఎన్నికలకు అర్హులంతా ఓటు నమోదు చేసుకుని.. వినియోగించుకోవాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర పూర్వ ప్రధాన కార్యదర్శి పి.పాండురంగ వరప్రసాదరావు అన్నారు. నగరంపాలెంలోని ఏపీటీఎఫ్ జిల్లా కార్యాలయంలో ఆదివారం పట్టభద్రుల ఓటు నమోదు కేంద్రంను ప్రారంభించారు. ఉపాధ్యాయ పత్రిక ప్రధాన సంచాలకులు షేక్ జిలాని, గుంటూరు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బసవలింగారావు, మహమ్మద్ ఖాలీద్, పల్నాడు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మహమ్మద్ ఉస్మాన్, మక్కెన శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అస్తవ్యస్తంగా నిలపకండి.. వినకుంటే ఠాణాకే బండి..



పండ్లబజార్‌లో హెచ్చరిక బోర్డులు



క్రేన్‌తో ద్విచక్ర వాహనం తరలిస్తూ..

గుంటూరు నగరంలో అస్తవ్యస్త పార్కింగ్‌కు ట్రాఫిక్ పోలీసులు చెక్ పెట్టారు. ప్రధాన కూడళ్లు, రద్దీ ప్రాంతాల్లో అస్తవ్యస్తంగా పార్కింగ్ చేయడం వల్ల ట్రాఫిక్‌కు అంతరాయం కలిగి గంటల తరబడి వాహనాలు నిలిచి పోతున్నాయి. అలాంటి ప్రాంతాలను ట్రాఫిక్ అధికారులు గుర్తించి అక్కడ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ఎవరైనా రహదారికి అడ్డంగా పార్కింగ్ చేస్తే అలాంటి ద్విచక్ర వాహనాలను క్రేన్‌తో ప్రత్యేక వాహనాల్లో ఎక్కించి పోలీస్‌స్టేషన్‌కు తరలిస్తున్నారు. **- ఈనాడు, గుంటూరు**

వైకాపా నాయకుడి దాష్టీకం

✦ అప్పు తీర్చమన్నందుకు తండ్రీ కుమార్తెపై దాడి ✦ నిందితుడు మాజీ ఎంపీ భరత్ ముఖ్య అనుచరుడు



దాడికి గురైన తండ్రీ కుమార్తెలు నాగరాజు, కావ్యశ్రీ

రాజమహేంద్రవరం నేరవార్తలు, న్యూస్‌టుడే: తీసుకున్న అప్పు తీర్చమని అడిగేందుకు వెళ్లిన ఓ తండ్రి, కుమార్తెపై వైకాపా నాయకుడు దాడిచేసిన ఘటన రాజమహేంద్రవరం ప్రకాశంనగర్ పోలీసు స్టేషన్ పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. సీఐ బాజీలాల్, బాధితుల వివరాల మేరకు.. మంగళగిరి సమీపంలోని కుంచనపల్లికి చెందిన కాజా కావ్యశ్రీ అనే యువతి పలు ఈవెంట్స్‌కు వ్యాఖ్యాత(యాంకరింగ్)గా చేస్తూ ప్రస్తుతం హైదరాబాద్‌లో నివాసముంటున్నారు. ఆమెకు రాజమహేంద్రవరానికి చెందిన వైకాపా నాయకుడు, మాజీ ఎంపీ మార్గాని భరత్‌రామ్ ముఖ్య అనుచరుడైన నల్లూరి వెంకట శ్రీనివాస్ కుమారుడు ఎన్.అభిలాష్‌తో స్నేహం ఉంది. ఆ క్రమంలో అభిలాష్ తాను చేసే వ్యాపారానికి రూ.3 లక్షలు అప్పుగా కావాలని కావ్యశ్రీని అడగడంతో ఆమె 2021లో నగదు ఇచ్చింది. ఆనాటి నుంచి వడ్డీ ఇవ్వకపోగా, అసలు గురించీ మాట్లాడటం మానేశాడు. ఆ విషయాన్ని అభిలాష్ తండ్రి శ్రీనివాస్ వద్దకు వచ్చి ఆ యువతి పలుమార్లు చెప్పింది. ఏళ్లు గడుస్తున్నా సాకులు చెప్పడంతో పాటు తండ్రీ కొడుకులు ఇద్దరూ కావ్యశ్రీ ఫోన్‌కు స్పందించలేదు. ఆదివారం కోనసీమ జిల్లా తాటిపాకలో ఓ ఈవెంట్‌కు యాంకరింగ్ చేసే క్రమంలో యువతి రాజమహేంద్రవరం వచ్చింది. ఆ క్రమంలోనే తన తండ్రి నాగరాజుతో కలసి ఆమె.. శ్రీనివాస్ ఇంటికి వెళ్లింది. అక్కడ అభిలాష్ లేకపోవడంతో తమ వద్ద తీసుకున్న నగదు ఇవ్వాలని శ్రీనివాస్‌ను నిలదీశారు. నగదు అడిగేందుకు ఇంటికే వస్తారా అని నాగరాజుతో పాటు కావ్యశ్రీపైనా శ్రీనివాస్ విచక్షణా రహితంగా దాడి చేశాడు. ఆ క్రమంలో బాధితురాలు పోలీసుస్టేషన్ వెళ్లి ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. గతంలో వైకాపా అధికారంలో ఉన్న సమయంలో నాటి ఎంపీ ప్రధాన అనుచరుడిగా ఉన్న శ్రీనివాస్ అనేక సెటిల్‌మెంట్లతో పాటు ఆ పార్టీలోనే పలువురు నాయకులతో తగదాలు పడినట్లు అభియోగాలున్నాయి.

మద్యం దుకాణాలకు ఉదయం 8 గంటలకు లాటరీ

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే : మద్యం దుకాణాలకు సోమవారం ఉదయం 8 గంటలకు లాటరీ ప్రారంభం అవుతుందని ఎక్సైజ్ గుంటూరు జోన్ డిప్యూటీ కమిషనర్ కె.శ్రీనివాసులు తెలిపారు. ఆదివారం గుంటూరులోని కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆ శాఖ సహాయ కమిషనర్ (ఏసీ), రవికుమార్‌రెడ్డి, గుంటూరు ఈఎస్ అరుణకుమారితో కలిసి డీసీ శ్రీనివాసులు మాట్లాడారు. వ్యాపారులు ఉదయం 7 గంటలకల్లా లాటరీ జరిగే వేదిక వద్దకు హాజరవ్వాలన్నారు. ఏదైనా కారణాలతో దరఖాస్తుదారు హాజరుకాలేకపోతే వారి తరపున ఇతరులను పంపిస్తే దరఖాస్తుదారు వ్యక్తిగత లేఖ (సెల్ఫ్ అటెస్టెడ్ ఫాం) భర్తీ చేసి వాటితో పాటు ఎంట్రీ పాస్‌తో వస్తే లాటరీకి అనుమతిస్తామన్నారు. గుంటూరులోని 127 దుకాణాలకు వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో రెండు కేంద్రాల ద్వారా ఇన్‌ఛార్జి కలెక్టర్, జేసీ, ఆర్డీఓల సమక్షంలో లాటరీ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

గుంటూరు పశ్చిమ

అన్ని రకాల పుస్తకాలు అందుబాటులోకి తెస్తాం


గ్రంథాలయంలోని పాఠకులతో మాట్లాడుతున్న పెమ్మసాని చంద్రశేఖర్, పక్కన ఎమ్మెల్యే నసీర్

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే: ప్రాంతీయ గ్రంథాలయంలో అవసరమైన అన్ని రకాల పుస్తకాలను అందుబాటులోకి తీసుకొస్తామని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. ఏసీ కళాశాల రోడ్డులోని ప్రభుత్వ ప్రాంతీయ గ్రంథాలయాన్ని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని ఆదివారం సందర్శించారు. గ్రంథాలయం శిథిలావస్థలో ఉండటం, స్లాబ్ పెచ్చులూడి ఉండటాన్ని గమనించి భవన నిర్మాణం, నిర్వహణ తదితర వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. గత ప్రభుత్వంలో కనీసం పేపర్లు, మ్యాగజైన్ల కొనుగోలుకు కూడా నిధులు కేటాయించకపోవడంతో పాఠకులు ఇబ్బందులు పడుతున్నారని అధికారులు వివరించారు. **విద్యార్థులతో మాటామంతి:** గ్రంథాలయంలో చదువుకుంటున్న విద్యార్థులతో పెమ్మసాని మాట్లాడారు. ఇక్కడ అన్ని పుస్తకాలు దొరుకుతున్నాయా? చదువుకోవడానికి సౌకర్యాలు ఉన్నాయా? అని ఆయన ప్రశ్నించారు. అకడమిక్ పుస్తకాలు అందుబాటులో లేవని, మరిన్ని సౌకర్యాలు కల్పిస్తే ఎక్కువ మంది ఇక్కడికి వచ్చి చదువుకుంటారని విద్యార్థులు వివరించారు. దీంతో పుస్తకాలన్నీ అందుబాటులోకి తెచ్చేందుకు చర్యలు తీసుకుంటామని పెమ్మసాని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్, కార్పొరేటర్ వేములపల్లి శ్రీరాంప్రసాద్, జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు, తెదేపా నాయకుడు మద్దిరాల మ్యాని పాల్గొన్నారు.

డ్రెయినేజీ వ్యవస్థను మెరుగుపరుస్తాం

పట్టాభిపురం, న్యూస్‌టుడే: గుంటూరులో అస్తవ్యస్తంగా ఉన్న డ్రెయినేజీ వ్యవస్థను మెరుగుపరుస్తామని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. శంభునగరంలో ఆదివారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులు సమస్యల్ని విన్నవించుకున్నారు. డ్రెయినేజీ సక్రమంగా లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. పారిశుద్ధ్యం మెరుగుపరిచేలా చర్యలు తీసుకోవాలని కోరారు. పెమ్మసాని స్పందిస్తూ గుంటూరు రూపురేఖలు మార్చే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రస్తుతం వర్షాలు విస్తృతంగా కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు జ్వరాల బారిన పడకుండా దోమల్ని అరికట్టేందుకు నిత్యం ఫాగింగ్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు దామచర్ల శ్రీనివాసరావు, వేములపల్లి శ్రీరాంప్రసాద్, వడ్డమాని వెంకటేశ్వరరావు, కొత్తపల్లి నాగేశ్వరరావు, ముప్పా వేణు, చైతన్య రత్నయ్య, శివాజీలు తదితరులు పాల్గొన్నారు.

కొత్త వాహనాల కొనుగోలుకు బడ్జెట్ విడుదల చేయాలి


సంఘ సభ్యులకు సాయం అందిస్తున్న పాపారావు

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే: ప్రభుత్వం అద్దె వాహనాలను రద్దు చేసి, కొత్త వాహనాల కొనుగోలుకు బడ్జెట్‌ను విడుదల చేయాలని ఏపీ ప్రభుత్వ వాహనాల డ్రైవర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు వేంపాటి పాపారావు కోరారు. కలెక్టరేట్ సమీపంలోని సంఘ కార్యాలయంలో ఆదివారం సంఘ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. వేంపాటి పాపారావు మాట్లాడుతూ డ్రైవర్ల సర్వీసు పరంగా ఉన్న సమస్యలపై సంఘ సభ్యులతో చర్చించారు. అనంతరం సర్వీసులో ఉంటూ అనారోగ్యంతో చనిపోయిన ముగ్గురికి, పదవీ విరమణ చేసిన ఏడుగురికి, ఒక సభ్యుడి కుమార్తె వివాహానికి సంఘం తరపున ఆర్థిక సాయాన్ని అందించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి జె.మునిబాబు, అసోసియేట్ అధ్యక్షుడు కె.నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులు టి.ఏడుకొండలు, షేక్ మహబూబ్ సుభాని, పి.నరసింహానాయుడు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సాయినాథ మహా సమాధి పూజోత్సవాలు

గుంటూరు సాంస్కృతికం, పట్టాభిపురం: సాయినాథ మహాసమాధి మహోత్సవాలు నగరంలో పలు సాయి ఆలయాల్లో వైభవంగా జరిగాయి. విద్యానగర్ సాయినాథ సన్నిధానంలో ఈ ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు. ఆలయ గౌరవాధ్యక్షుడు యడ్లపాటి అశోక్ కుమార్, అధ్యక్షుడు వడ్లమూడి శివరామకృష్ణయ్య, కార్యదర్శి యడ్లపాటి స్వరరూపరాణి, కోశాధికారి మొవ్వ సంజీవరావు కార్యక్రమాలను పర్యవేక్షించారు. చైతన్యపురి కాలనీ, రాజేంద్రనగర్ సాయిబాబా మందిరాల్లో సమాధి ఉత్సవాలు నిర్వహించారు.


పూజలో భక్తులు

రేపటి సైనికుల కోసం..

ఎన్‌సీసీ క్యాడెట్లకు 10 రోజుల శిక్షణ

మూడు జిల్లాల నుంచి విద్యార్థులు హాజరు

రాజేంద్రనగర్(గుంటూరు), న్యూస్‌టుడే

నేటి యువత ఎన్‌సీసీలో చేరి బాధ్యత గల పౌరులుగా, ఆత్మవిశ్వాసంతో మదినిండా జాతీయతా భావాన్ని నింపుకొని ముందుకు సాగుతున్నారు. ఐక్యత, క్రమశిక్షణ లక్ష్యంగా క్యాడెట్లకు సైనిక సిబ్బంది కవాతు, ఫైరింగ్, తదితర అంశాల్లో క్యాడెట్లకు శిక్షణ అందించారు. కల్నల్ సి.ఎస్.సిద్ధూ పర్యవేక్షణలో లెఫ్టినెంట్ కల్నల్ దీపక్‌కుమార్‌శర్మ ఆధ్వర్యంలో ఈనెల 4 నుంచి 13వ తేదీ వరకు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో జరిగిన ఉమ్మడి వార్షిక శిక్షణ శిబిరంలో మూడు జిల్లాలకు చెందిన 600 మంది క్యాడెట్లు పాల్గొన్నారు. శిక్షణ తీరును, ఎన్‌సీసీ క్యాడెట్ల అభిప్రాయాలు తెలుసుకుందాం.

శిక్షణ విధానం ఇలా..

పది రోజుల శిక్షణలో భాగంగా దిల్లీ గణతంత్ర శిబిరం కోసం సన్నద్ధమయ్యే క్యాడెట్లతో పాటు ఇతర క్యాడెట్లకు కవాతు, ఫైరింగ్, ఆయుధ శిక్షణ, మ్యాప్‌రీడింగ్, టెంట్ పిచ్చింగ్, శారీరక దారుఢ్యం కోసం పరుగు, వ్యాయామం, తదితర అంశాల్లో సైనిక సిబ్బంది క్యాడెట్లకు శిక్షణ అందించారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా దేశభక్తి, జాతీయ సమైక్యతను పెంపొందించే బృంద నృత్యం, బృంద గానం విభాగాల్లో క్యాడెట్లు ఉత్సాహంగా పాల్గొన్నారు. వ్యక్తిత్వ వికాస తరగతుల్లో భాగంగా త్రివిధ దళాల్లో చేరడానికి అవకాశాలను ఆర్మీ రిక్రూట్‌మెంట్ కార్యాలయ మెడికల్ అధికారి అమర్‌దీప్‌కుమార్ వివరించారు. అగ్నిప్రమాదాలు జరిగినపుడు చేయాల్సిన విధానాన్ని అగ్నిమాపకదళ సిబ్బంది ప్రయోగాత్మకంగా చూపించారు. సిబార్ వైద్యులు దంత పరీక్షలు, మలేరియా అవగాహన సదస్సులు నిర్వహించారు.


ఫైరింగ్ చేస్తున్న క్యాడెట్లు


కవాతులో శిక్షణ పొందుతున్న క్యాడెట్లు

ఐజీసీకి సిద్ధం


– వి.పూజిత, ఏఎన్‌యూ



ఈసీఈ మూడో సంవత్సరం చదువుతున్నా. గత ఏడాది 'బి' సర్టిఫికెట్‌లో ఉత్తీర్ణత సాధించి 'సి' సర్టిఫికెట్‌కు సిద్ధమవుతున్నాను. ప్రస్తుతం ఆర్డీసీ కోసం శిక్షణ పొందుతున్నాను. సాంస్కృతిక విభాగంలో భాగంగా సింగింగ్ పోటీల్లో ఈనెల 16 నుంచి సికింద్రాబాద్‌లో జరిగే ఇంటర్ గ్రూప్ పోటీలకు సిద్ధమవుతున్నా. ఎన్‌సీసీతో నాయకత్వ లక్షణాలు, సమయపాలన, నలుగురిలో మాట్లాడటం నేర్చుకున్నాను. చదువు, ఎన్‌సీసీ సమతుల్యత పాటిస్తున్నాను. ఎన్‌సీసీతో శారీరక దారుఢ్యం పెరిగింది. సైన్యంలో చేరాలనేది నా లక్ష్యం.

మనోభావాలు దెబ్బతినకుండా..

– జి.ఎస్.చైతన్య, బృందావన్ గార్డెన్స్



కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ నాలుగో సంవత్సరం చదువుతున్నాను. ఇప్పటి వరకు 10 క్యాంపులు చేశాను. గత ఏడాది ప్రీఆర్డీ-2, స్పెషల్ ఎన్ఐసీ, అడ్వాన్స్ లీడర్‌షిప్ శిబిరాలకు వెళ్లాను. ఈ శిబిరానికి సీనియర్‌గా వ్యవహరించాను. పని విభజన, సమయపాలన, క్యాడెట్లను నియంత్రించడం నేర్చుకున్నాను. ముఖ్యంగా పాఠశాల విద్యార్థులను జాగ్రత్తగా చూసుకోవడం, క్యాడెట్ల మనోభావాలు దెబ్బతినకుండా చూడటం, సైనిక అధికారుల ఆజ్ఞలు పాటించేలా చేయడం నేర్చుకున్నాను. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా స్థిరపడాలనేది నా కోరిక.

నియామకపత్రం అందజేత



ఆంధ్రప్రదేశ్ శరీర, అవయవ దాతల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా ఆచార్య రమణ యశస్వి శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన సర్వజనాసుపత్రి ఆర్థో విభాగం అధిపతిగా పని చేస్తున్నారు. గుంటూరులో జరిగిన ఓ కార్యక్రమంలో అఖిల భారత శరీర, అవయవ దాతల సంఘం వ్యవస్థాపకురాలు గూడూరు సీతామహాలక్ష్మి నియామకపత్రాన్ని అందజేసినట్లు యశస్వి రమణ తెలిపారు. ఇప్పటి వరకు జిల్లా అధ్యక్షుడిగా పని చేస్తున్నట్లు తెలిపారు. **-న్యూస్‌టుడే, గుంటూరు వైద్యం**

శ్రీవారి బ్రహ్మోత్సవ వైభవంపై ప్రవచనం

గుంటూరు సాంస్కృతికం: బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వర స్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై తిరుమల బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఆదివారం రాత్రి నోరి నారాయణ మూర్తి బ్రహ్మోత్సవ వైభవం అనే అంశంపై ప్రసంగించారు. తొలుత ఆలయ కమిటీ అధ్యక్షుడు సీహెచ్.మస్తానయ్య, సహాయ కార్యదర్శులు పుట్టగుంట ప్రభాకరరావు, ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

నేడు బాధ్యతలు స్వీకరించనున్న ఏవోలు

జిల్లాపరిషత్తు, న్యూస్‌టుడే: జిల్లాపరిషత్తు కార్యాలయంలో విభాగాల పరిపాలన అధికారులుగా నియమితులైన ఏవోలు సోమవారం బాధ్యతలు స్వీకరించనున్నారు. గత నెలలో జడ్పీకి బదిలీపై వచ్చిన ఏవోలతో పాటు ఉద్యోగులకు మొత్తం పది విభాగాల్లో సీట్లను కేటాయిస్తూ జడ్పీ సీఈవో జ్యోతిబసు ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు. దసరా పండగ సెలవులు రావడంతో స్పష్టంగా విధుల్లో చేరలేదు. సోమవారం ఏవోలు, మినిస్టీరియల్ ఉద్యోగులు వారికి కేటాయించిన ఆయా విభాగాల్లో చేరారు.

విద్యుత్తు సరఫరాకు అంతరాయం నేడు

గుంటూరు విద్యుత్తు, న్యూస్‌టుడే: టౌన్-3 సబ్ డివిజన్ పరిధిలో విద్యుత్తు లైన్ల మరమ్మతులు చేపట్టనున్నందున ఈనెల 14న విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు డీఈఈ రాజమోహనరావు తెలిపారు. దీనిలో సోమవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నల్లచెరువు, సంగడిగుంట, పట్నంబజారు, డీఎస్ నగర్, ఏటుకూరు రోడ్డు, చలమయ్య కళాశాల, ఇనుపసంతబాలమేడ, గాంధీనగర్, మూడుబొమ్మలు, వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయం, ముక్తీవీధి, బాబుహోటల్ తదితర ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు.

చర్మ సమస్యలపై అప్రమత్తత అవసరం

గుంటూరు వైద్యం, న్యూస్‌టుడే: చర్మ సమస్యల పట్ల అందరూ అప్రమత్తంగా ఉండాలని డెర్మటాలజిస్ట్ రామకృష్ణ సూచించారు. అరండల్ పేటలోని అవగాహన సంస్థలో ఆదివారం నిర్వహించిన ఆరోగ్య సభలో రామకృష్ణ మాట్లాడుతూ చర్మం మన శరీరంలోనే అతిపెద్ద అవయవమన్నారు. చిన్న జాగ్రత్తలు తీసుకుంటే చర్మ సమస్యలు చాలావరకు నివారించుకోవచ్చన్నారు. అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గుంటూరు వైద్యం: మానసిక సమస్యలకు సత్వరమే చికిత్స పొందితే మంచి ఫలితాలు ఉంటాయని కాటూరి వైద్య కళాశాల మానసిక వ్యాధుల విభాగం అధిపతి సురేష్‌కుమార్ సూచించారు. ఎస్‌హెచ్‌వో హైపర్ టెన్షన్ అండ్ డయాబెటిక్ క్లబ్, మానవత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం బ్రాడీపేటలోని ఎస్‌హెచ్‌వో భవన్‌లో మానసిక సమస్యలపై ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ సేవకుమార్ తదితరులు పాల్గొన్నారు.


యువకుడి ఆత్మహత్య

పట్టాభిపురం: మద్యానికి బానిసైన ఒక యువకుడు సైకోగా వ్యవహరిస్తూ తల్లిదండ్రులు, భార్య పిల్లల్ని వేధిస్తుడటంతో ఠాణాలో ఫిర్యాదు చేసేందుకు వచ్చారని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన నేతాజీనగర్‌లో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. నేతాజీ నగర్‌కు చెందిన మీరావలి (25) మద్యానికి బానిసయ్యాడు. సైకోగా ప్రవర్తిస్తూ భార్య పర్వీనాను వేధిస్తున్నాడు. ప్రశ్నించినందుకు తల్లిదండ్రులు ఖాసింబీ, నాగుల్‌మీరాలపై కూడా దాడి చేశాడు. దీంతో వారు పట్టాభిపురం ఠాణాలో ఫిర్యాదు చేస్తామని మీరావలికి చెప్పడంతో.. మీరు అక్కడకు వెళ్తే ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించాడు. వారు ఠాణాకు వచ్చారని తెలిసి మీరావలి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తండ్రి ఫిర్యాదు మేరకు పట్టాభిపురం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


కొరిటెపాడు కోదండ రామాలయంలో..


శ్యామలనగర్ సంతోషిమాతా దేవాలయంలో..


రామలింగేశ్వరస్వామి దేవాలయంలో


ఎస్వీఎన్ కాలనీలో..


వేంకటేశ్వర కాలనీలో...


బృందావన్ గార్డెన్స్‌లో రాజరాజేశ్వరీ దేవి అలంకారం


విద్యానగర్ సాయినాథ సన్నిధానంలో..


మారుతీ దేవాలయంలో..


ఆర్.అగ్రహారం వేంకటేశ్వర స్వామి దేవాలయంలో శమీ పూజలో ఎమ్మెల్యే లక్ష్మీనారాయణ కుటుంబ సభ్యులు


వికాస్ నగర్‌లోని శిర్డీ సాయి మందిరంలో..

శక్తి ఆరాధనలు.. శమీ పూజలు

గుంటూరు సాంస్కృతికం, పట్టాభిపురం, ఎస్వీఎన్ కాలనీ, గోరంట్ల, న్యూస్‌టుడే: శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా ముగిశాయి. ఈసందర్భంగా శనివారం నగరంలోని పలు దేవాలయాల్లో అమ్మవారికి రాజరాజేశ్వరి అలంకారాలను తీర్చిదిద్దారు. సాయంత్రం వేళ శమీపూజలు, అపరాజితాదేవి పూజలు జరిగాయి. పలు వేదికలపై జగదంబను స్తుతిస్తూ సంకీర్తన గానాలు జరిగాయి. స్తంభాలగరువు కోదండ రామాలయంలో అఖండ హరేరామ.. హరేకృష్ణ సప్తాహం జరిగింది. గోరంట్లలోని వేంకటేశ్వర కాలనీలో శిర్డీ సాయి ఆధ్యాత్మిక సేవా సంస్థ ఆధ్వర్యంలో జ్ఞాన సరస్వతీ ఆలయంలో దసరా నవరాత్రి ఉత్సవాలు విజయదశమితో ముగిశాయి.

వైభవంగా రథోత్సవం.. **గుంటూరు సాంస్కృతికం:** సంపత్ నగర్ శారదాపరమేశ్వరి దేవస్థానంలో శరన్నవరాత్రుల ఉత్సవాల ముగింపు సందర్భంగా ఆదివారం రాత్రి దివ్య రథోత్సవం వైభవంగా జరిగింది. సంపత్‌నగర్ ప్రధాన వీధుల్లో ఊరేగింపు సందడి చేసింది.


దేవీ కీర్తన గానం చేస్తున్న డాక్టర్ కమలవల్లి, ఇందుమతి

అస్తవ్యస్తంగా నిలపకండి.. వినకుంటే ఠాణాకే బండి..



పండ్లబజార్‌లో హెచ్చరిక బోర్డులు

గుంటూరు నగరంలో అస్తవ్యస్త పార్కింగ్‌కు ట్రాఫిక్ పోలీసులు చెక్ పెట్టారు. ప్రధాన కూడళ్లు, రద్దీ ప్రాంతాల్లో అస్తవ్యస్తంగా పార్కింగ్ చేయడం వల్ల ట్రాఫిక్‌కు అంతరాయం కలిగి గంటల తరబడి వాహనాలు నిలిచిపోతున్నాయి. అలాంటి ప్రాంతాలను ట్రాఫిక్ అధికారులు గుర్తించి అక్కడ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ఎవరైనా రహదారికి అడ్డంగా పార్కింగ్ చేస్తే అలాంటి ద్విచక్ర వాహనాలను క్రేన్‌తో ప్రత్యేక వాహనాల్లో ఎక్కించి పోలీస్ స్టేషన్‌కు తరలిస్తున్నారు. **-ఈనాడు, గుంటూరు**


క్రేన్‌తో ద్విచక్ర వాహనం తరలిస్తూ..

సంగీత మహోత్సవాలు ప్రారంభం

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: లక్ష్మీపురం త్యాగరాజ సాంస్కృతిక సంఘం వార్షికోత్సవాలు, వాగ్గేయకారుల సంగీత మహోత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఈసందర్భంగా జరిగిన సభలో తొలుత ముఖ్య అతిథి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి ఏవీ శేషసాయి, అర్చక అకాడమీ పూర్వ డైరెక్టర్ డాక్టర్ వేదాంతం రాజగోపాల్ చక్రవర్తి, సంస్థ అధ్యక్షుడు డాక్టర్ రామరాజు శ్రీనివాస్ జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. సభానంతరం కర్ణాటక సంగీత పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. అతిథులను సంస్థ ఉపాధ్యక్షుడు ఎస్.గిరిజాశంకర్ సత్కరించారు. ప్రధాన కచేరీలో భాగంగా సిక్కిల్ గురుచరణ్(చెన్నై) కర్ణాటక గాత్ర సంగీత కచేరి జరిగింది. వై.రాజ్యలక్ష్మి, ఫణితేజ కార్యక్రమాలను నిర్వహించారు.



విజేతలతో అతిథులు, నిర్వాహకులు

అలరించిన మలేకర్ పాటల విభావరి

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: కళాదర్బార్ అమరావతి ఆధ్వర్యంలో శ్రీవేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఆదివారం రాత్రి జరిగిన హిందీ పాటల కార్యక్రమం అలరించింది. హిందీ చలనచిత్ర గాయని సంగీత మలేకర్ పలు హిందీ చలన చిత్రాల్లోని గీతాలను ఆలపించారు. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు పొత్తూరి రంగారావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పలువురు హిందీ పాటలు ఆలపించారు. అనంతరం జరిగిన సన్మాన సభలో తూర్పు ఎమ్మెల్యే నసీర్, మిర్చియార్డు మాజీ ఛైర్మన్ మన్నవ సుబ్బారావులు సంగీత మలేకర్‌కు 'సింగింగ్ స్టార్' అవార్డు ప్రదానం చేసి సత్కరించారు. కార్యక్రమంలో కళా దర్బార్ కమిటీ సభ్యులు బి.బాలస్వామి, రాజశేఖర్, హనుమాన్ సింగ్, పీటర్ పాల్, సత్తార్ పాల్గొన్నారు.



సంగీత మలేకర్‌ను సత్కరిస్తున్న రంగారావు, సుబ్బారావు, నసీర్ తదితరులు

పుష్కరిణికి పూర్వవైభవం.. అమ్మవారికి తెప్పోత్సవం


వ్యర్థాలతో నిండిన పుష్కరిణి


టైర్ల సాయంతో వ్యర్థాలు తొలగిస్తున్న మంజునాథ్

గుంటూరు ఆర్ అగ్రహారంలో దశాబ్దాలుగా చెత్తా చెదారం వ్యర్థాలతో నిండి మురుగు కూపంగా మారిన పురాతనమైన పవిత్ర బిందు తీర్థం బాగు చేశారు రైల్వే ఉద్యోగి మంజునాథ్. 1896లో జిల్లా మెజిస్ట్రేట్‌గా ఉన్న కేతరాజు జగన్నాథం పంతులు శిక్షపడిన వారిలో పరివర్తన కోసం ఖైదీలతో ఈ బిందు తీర్థం పుష్కరిణిని తవ్వించారు. ఈ కోనేటిలో నీటి ఊటలు అనేకం ఉండడంతో గుంటూరుకు ప్రధాన తాగునీటి వనరుగా ఉండేది. గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి, కాళీయమర్దనస్వామి ఉత్సవాలు, దసరా అమ్మవారి తెప్పోత్సవాలు ఇక్కడ వైభవంగా జరిగేవి. ఇంతటి ప్రాధాన్యం కలిగిన పురాతన కోనేరు కాలక్రమేనా పాలకుల ఉదాసీనతతో మురుగుకూపంగా మారింది. ఇదే ప్రాంతానికి చెందిన మంజునాథ్ టైర్లనే పడవాలా చేసుకుని పుష్కరిణితో పేరుకున్న వ్యర్థాలను తొలగించారు. శనివారం అమ్మవారి తెప్పోత్సవం నిర్వహించి పుష్కరిణికి పూర్వ వైభవం తీసుకొచ్చారు. **- ఈనాడు, గుంటూరు**


తెప్పోత్సవం నిర్వహిస్తూ..


భ్రమరాంబ అమ్మవారు

ప్రముఖులకు ఆర్యసమాజం సత్కారాలు






సన్మానం అందుకుంటున్న జానకీదేవి, మల్లికార్జునరావు, ముఖేష్

గుంటూరు సాంస్కృతికం: అరండల్‌పేట ఆర్య సమాజ మందిరంలో పండిత గోపదేవ్ వైదిక ధర్మ ప్రచార సమితి ఆధ్వర్యంలో బిరుద సత్కార కార్యక్రమం ఆదివారం జరిగింది. వైదిక ధర్మ ప్రచారకురాలు కోనేరు జానకీదేవికి ఆర్యమాత బిరుదు సత్కారం, కొత్తమాసు మల్లికార్జునరావుకు ఆర్యపురుష బిరుదు సత్కారం చేసి ఒక్కొక్కరికి రూ.25,116 నగదు బహుమతిని అందజేశారు. వరల్డ్ జూనియర్ షూటింగ్ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొని బంగారు పతకాలు సాధించిన నేలవల్లి ముఖేష్‌కు వైదిక శుభాశీస్సులు అందించి సత్కరించారు. డాక్టర్ కొసరాజు రవీంద్ర సభకు అధ్యక్షత వహించారు. మాజీ ఎంపీ యలమంచిలి శివాజీ, డాక్టరు కొండబోలు కృష్ణప్రసాద్, నూతలపాటి అరవింద్, మాఘం కృష్ణమూర్తి, పులివర్తి శ్రీనివాసరావు, నాగభైరవ గంగాపార్వతి, గుర్రం నిర్మలాదేవి, వాసిరెడ్డి శ్రీనివాసప్రసాద్ పాల్గొన్నారు. ఏలూరి సూర్యనారాయణ కార్యక్రమాలను నిర్వహించారు.

మద్యం దుకాణాలకు ఉదయం 8 గంటలకు లాటరీ

గుంటూరు నేరవార్తలు: మద్యం దుకాణాలకు సోమవారం ఉదయం 8 గంటలకు లాటరీ ప్రారంభం అవుతుందని ఎక్సైజ్ గుంటూరు జోన్ డిప్యూటీ కమిషనర్ కె.శ్రీనివాసులు తెలిపారు. ఆదివారం గుంటూరులోని కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆ శాఖ సహాయ కమిషనర్ (ఏసీ), రవికుమార్‌రెడ్డి, గుంటూరు ఈఎస్ అరుణకుమారితో కలిసి డీసీ శ్రీనివాసులు మాట్లాడారు. వ్యాపారులు ఉదయం 7 గంటలకల్లా లాటరీ జరిగే వేదిక వద్దకు హాజరవ్వాలన్నారు. ఏదైనా కారణాలతో దరఖాస్తుదారు హాజరుకాలేకపోతే వారి తరపున ఇతరులను పంపిస్తే దరఖాస్తుదారు వ్యక్తిగత లేఖ (సెల్ఫ్ అటెస్టెడ్ ఫాం) భర్తీ చేసి వాటితో పాటు ఎంట్రీ పాస్‌తో వస్తే లాటరీకి అనుమతిస్తామన్నారు. గుంటూరులోని 127 దుకాణాలకు వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో రెండు కేంద్రాల ద్వారా ఇన్‌ఛార్జి కలెక్టర్, జేసీ, ఆర్డీఓల సమక్షంలో లాటరీ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.